


# విజయభాను

45 వ వార్షికోత్సవం విజయభాను

విశాఖపట్నం, గురువారం 17-11-2022 VIJAYABHANU DAILY * VISAKHAPATNAM సంపుటి : 47 సంచిక : 55 పేజీలు : 09 వెల : 1 రూపాయి

## ప్రభుత్వ లాంఛనాలతో ముగిసిన కృష్ణ అంత్యక్రియలు

### కృష్ణకు నివాళి.. కుటుంబ సభ్యులకు సీఎం జగన్ పరామర్శ





హైదరాబాద్: తెలుగు చలన చిత్ర పరిశ్రమ దిగ్గజం, నటశేఖర సూపర్ స్టార్ కృష్ణకు కడసారి వీడ్కోలు పలికేందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చారు. బుధవారం ఉదయం తాడేపల్లి(గుంటూరు) నుంచి హైదరాబాద్‌కు చేరుకున్న ఆయన.. పద్మాలయ స్టూడియోకు వెళ్లారు. అక్కడ కృష్ణ పార్థివ దేహానికి ఆయన నివాళులు అర్పించారు. పద్మాలయ స్టూడియోలో ప్రజల సందర్శన కోసం ఉంచిన కృష్ణ పార్థివ దేహానికి.. ఏపీ సీఎం వైఎస్ జగన్ నివాళులర్పించారు. అనంతరం.. ఘట్టమనేని కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. కుటుంబ సభ్యులతో కాసేపు మాట్లాడారు. కృష్ణ తనయుడు మహేష్ బాబుని హత్తుకుని ఓదార్చారు సీఎం జగన్.

దిగ్గజ నటుడు సూపర్‌స్టార్ కృష్ణ అంత్యక్రియలు ముగిశాయి. అభిమానుల కన్నీటి వీడ్కోలు మధ్య పద్మాలయ స్టూడియోస్ నుంచి మహాప్రస్థానం వరకూ కృష్ణ అంతిమయాత్ర సాగింది. కృష్ణను కడసారి చూసేందుకు ఆయన అభిమానులు మహాప్రస్థానం రహదారికి ఇరువైపులా భారీగా చేరారు. అనంతరం ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో కృష్ణ అంత్యక్రియలు నిర్వహించారు. మహాప్రస్థానంకు చేరుకున్న కృష్ణ పార్థివదేహం.. పాడె మోసిన మురళీ మోహన్, బుద్దా వెంకన్న సూపర్ స్టార్ కృష్ణ పార్థివదేహం జూబ్లీహిల్స్ లోని మహాప్రస్థానం శ్మశాన వాటికకు చేరుకుంది. పద్మాలయా స్టూడియోస్ నుంచి మహాప్రస్థానం వరకు అంతిమయాత్ర కొనసాగింది. పద్మాలయా స్టూడియోస్‌లో కృష్ణ పార్థివదేహానికి పోలీసులు గౌరవ వందనం చేశారు. అనంతరం పోలీస్ బ్యాండ్ మధ్య అంతమ యాత్ర కొనసాగింది. పోలీసులు మహాప్రస్థానంలోకి అందరినీ అనుమతించలేదు. సన్నిహితులను మాత్రమే లోపలకు పంపి, ఇతరులందరినీ బయటే ఆపేశారు. మహాప్రస్థానం కు చేరుకున్న తర్వాత కృష్ణ పాడెను ఆయన చిన్ననాటి మిత్రుడు, సినీ నటుడు మురళీమోహన్, టీడీపీ నేత బుద్దా వెంకన్న మోశారు.

**జనసంద్రమైన రోడ్డు**

టాలివుడ్ సూపర్ స్టార్ కృష్ణ అంతిమయాత్ర ప్రారంభమైంది. పద్మాలయా స్టూడియోస్ నుంచి ఆయన పార్థివదేహం బయల్దేరింది. ఈ సందర్భంగా ఆయనను కడసారి చూసుకునేందుకు వచ్చిన అభిమానులందరూ కంటతడి పెట్టుకుంటున్నారు. భారీ భద్రత మధ్య యాత్ర కొనసాగుతోంది. పూలతో అలంక రించిన వాహనంలో

తరువాయి 2లో..

## విమాన ప్రయాణికులకు మాస్క్ నిబంధన ఎత్తివేసిన కేంద్రం



దిల్లీ: విమానాల్లో ప్రయాణించే వారు తప్పనిసరిగా మాస్క్ ధరించే అంశంపై కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. దేశంలో కరోనా కేసుల సంఖ్య తగ్గుముఖం పట్టిన వేళ ఇకపై విమానాల్లో మాస్కులు ధరించడం తప్పనిసరి కాదని స్పష్టం చేసింది. కేసులు తగ్గుతున్నప్పటికీ మాస్కులు ధరించడమే మంచిదని సూచించింది. ఎవరైనా మాస్కులు ధరించాలనుకుంటే.. వారి ఇష్టమేనని పేర్కొంది. కరోనా వైరస్ విజృంభించినప్పట్నుంచి ఇప్పటివరకు విమాన ప్రయాణికులకు మాస్కులు ధరించడం తప్పనిసరిని కఠినంగా అమలుచేస్తూ వస్తోన్న విషయం తెలిసిందే. అయితే, కొవిడ్ కేసులు తగ్గడంతో ప్రయాణికులు మాస్కులు ధరించేందుకు ఉద్దేశించి విమానాల్లో చేసే జరిమానా/శిక్షార్హమైన చర్యలపై ఇకపై ఎలాంటి సూచనల్ని ప్రకటించాల్సిన అవసరం లేదని కేంద్ర విమానయాన మంత్రిత్వశాఖ పేర్కొంది. దేశంలో బుధవారం 501 కొత్త కొవిడ్ కేసులు నమోదయ్యాయి. దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య ప్రస్తుతం 7561(0.02శాతం) ఉండగా.. రికవరీ రేటు 98.79శాతంగా ఉన్న విషయం తెలిసిందే.

## నూతన వీసా పథకానికి బ్రిటన్ ప్రధాని గ్రీన్ సిగ్నల్

### భారత యువ ప్రొఫెషనల్స్‌కు గుడ్‌న్యూస్



లండన్ : భారత యువ ప్రొఫెషనల్స్‌కు బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ తీపికబురు అందించారు. భారత్ నుంచి బ్రిటన్‌లో పనిచేసేందుకు ఏటా 3000 మంది యువ ప్రొఫెష నల్స్‌ను అనుమతించే సరికొత్త వీసా పథకానికి బ్రిటన్ ప్రధాని గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. గత ఏడాది ఇరు దేశాల మధ్య కుదిరిన వలస భాగస్వామ్య ఒప్పందం స్ఫూర్తితో ఈ తరహా పథకం కింద లబ్ధి పొందిన తొలి వీసా-నేషనల్ దేశంగా భారత్ నిలిచిందని బ్రిటన్ పేర్కొంది. బ్రిటన్-భారత్ యువ ప్రొఫెషనల్స్ స్కీమ్ ఖరారైందని, ఈ స్కీమ్‌లో భాగంగా డిగ్రీ చదివిన 18-30 ఏండ్ల లోపు భారత యువ ప్రొఫెషనల్స్ బ్రిటన్‌కు వచ్చి పనిచేస్తూ రెండేండ్ల పాటు ఇక్కడే ఉండవచ్చని బ్రిటన్ ప్రధాని కార్యాలయం ట్వీట్ చేసింది.

ఈ స్కీమ్ ప్రారంభించడం భారత్‌తో ద్వైపాక్షిక బంధంలో మేలి మలుపని తెలిపింది. ఇది ఇరు దేశాల ఆర్థిక వ్యవస్థల బలోపేతానికి దోహదం చేస్తుందని బ్రిటన్ ప్రధాని కార్యాలయం పేర్కొంది. బ్రిటన్ నిర్ణయంతో అత్యంత నైపుణ్యం కలిగిన భారత్ యువత ఇప్పుడు ఇంకా పెద్దసంఖ్యలో బ్రిటన్‌లో అవకాశాలు పొందుతారని బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ ఆకాంక్షించారు. ఇరు దేశాల ఆర్థిక వ్యవస్థలూ, సమాజాలు సుసంపన్న మవుతాయని అన్నారు.

## రాయితీలు ఎత్తివేసి.. జేట్యాక్స్‌తో దోచుకుంటున్నారు

### తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు



అమరావతి, (విజయభాను న్యూస్) : ఆక్వా రైతులను ఆదుకోవాల్సిన ముఖ్యమంత్రి జగన్.. ప్రశ్నించిన తెదేపా నేతలపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేయడం సరైన పద్ధతి కాదని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు మండిపడ్డారు. పశ్చిమ గోదావరి జిల్లా ఉండిలో తెదేపా నేతలపై నమోదు చేసిన అక్రమ కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు అచ్చెన్న ప్రకటన విడుదల చేశారు. తెదేపా అధినేత చంద్రబాబు హయాంలో రాష్ట్రంలో అగ్రభాగాన ఉన్న ఆక్వారంగం నేడు పతనమైందన్నారు. మద్దతు ధర లభించక ఆక్వా రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. షరతుల పేరుతో రాయితీలు ఎత్తివేసి, జేట్యాక్స్ తో ఆక్వా రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. ప్రశ్నించిన వారిని అణచివేయాలనే జగన్ రెడ్డి తీరు.. ఇకపై సాగనివ్వబోమని హెచ్చరించారు.

## మాజీ మంత్రి నారాయణకు హైకోర్టులో ఊరట..

### ఆయన నివాసంలోనే విచారించాలని ఆదేశం

అమరావతి, (విజయభాను న్యూస్) : ఏపీ రాజధాని అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్ మాస్టర్ ప్లాన్‌లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలతో సీఐడి అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా .. సాక్షిగా విచారణకు రావాలంటూ మాజీమంత్రి, తెదేపా సీనియర్ నేత నారాయణకు సీఐడీ అధికారులు 160 సీఆర్‌పీసీ నోటీసు ఇచ్చారు. అయితే, ఈ నోటీసుపై మాజీమంత్రి నారాయణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అనారోగ్యంతో ఉన్నారని.. ఇటీవల శస్త్రచికిత్స జరిగిందని పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపించారు.

నారాయణకు 65 ఏళ్ల వయసు దాటిందని న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. వాదనలు విన్న న్యాయస్థానం.. నారాయణను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలోనే న్యాయవాది సమక్షంలో సీఐడీ అధికారులు విచారించుకోవచ్చని స్పష్టం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.




## నిరంతర అభ్యసనంతో అభివృద్ధి

### ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకలపతి ఆచార్య పివిజిడి ప్రసాద్ రెడ్డి



ఆంధ్రవిశ్వవిద్యాలయం (విజయభాను న్యూస్) : నిరంతర అభ్యసనంతో అభివృద్ధి సాధ్యపడుతుందని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకలపతి ఆచార్య పివిజిడి ప్రసాద్ రెడ్డి అన్నారు. బుధవారం ఉదయం కళాశాల వైవిఎస్ మూర్తి ఆడిటోరియంలో అంతర్జాతీయ జిఐఎస్ డే ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ నేడు మన ఆలోచనలే మనకు గుర్తింపుని, అవకాశాలను అందిస్తున్నాయనే వాస్తవాన్ని యువత గ్రహించాలని అన్నారు. ఆలోచనలను వ్యాపారంగా మార్చుకునే దిశగా అవసరమైన సహకారం తాము అందిస్తున్నామన్నారు యువత నిరంతరం తమ నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి కృషి చేయాలని చెప్పారు. యువత ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా, ఉపాధిని

తరువాయి 2లో..

# గీతం విడిసి ఆధ్వర్యంలో "టింకరింగ్ డే"






సాగర్‌నగర్ (విజయభాను న్యూస్) : పాఠశాలల విద్యార్థులలో నూతన ఆవిష్కరణల పట్ల ఆసక్తిని పెంచేవిధంగా కేంద్రప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రారంభించిన అటల్ టింకరింగ్ ప్రయోగ శాలల సంఖ్య 10,000 దాటిన సందర్భంగా బుధవారం టింకరింగ్ డే పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని వెంచర్ డవలప్మెంట్ సెంటర్ (వి.డి.సి) శిక్షకులు నగరంలోని వివిధ పాఠశాలలకు వెళ్ళి సూక్ష్మ ప్రాజెక్టలపై అవగాహన కల్పించారు. నూతన ఆవిష్కరణలు, వాటి ప్రయోజనం, స్టార్టప్ వాతావరణం, అటల్ ఇన్నోవేషన్ మిషన్ లక్ష్యాలతో పాటు పాఠశాల విద్యార్థులు బృందంగా ఏర్పడి నూతన ఆలోచనలపై ఏవిధంగా దృష్టి నిలపాలి అనే అంశాలను వివరించారు. 30 నిమిషాల వ్యవధితో ఉండే ప్రాజెక్టులను అటల్ టింకరింగ్ ప్రయోగ శాలలో తయారు చేయడంపై శిక్షణ ఇచ్చారు. గీతం విడిసి శిక్షకులు (కోచ్) బి.రాజ్ కుమార్, వైకట గౌతమ్, సంధ్యారాణి, రాహూల్ ఉప్పసాల నగరంలోని వివిధ పాఠశాలలలో ఈ కార్యక్లమాలను పర్యవేక్షించారు.

# దశాబ్ధ కాలం జర్నలిజం సేవలు

## సాదరంగా సన్మానించిన డివి యువసేన సభ్యులు శ్రీను



అనకాపల్లి జిల్లా కోటవురట్ల : దశాబ్ద కాలం కంటే ఎక్కువ కాలం నుండి మండలంలో జర్నలిజంలో సేవలు అందిస్తున్న వారికి ఘన సన్మానం జరిగింది.మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణ రాజు, ప్రస్తుత వైఎస్ఆర్సిపి రాష్ట్ర నాయకులు డివి యువసేన పేరుతో అనేక రకాల సేవలు చేస్తున్న చామంతుల శ్రీను ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. గురువారం మండలంలోని విలేకరులందరినీ సన్మానించారు. ఈ సందర్భంగా డివి సూర్యనారాయణ మాట్లాడుతూ.... ఇటువంటి ఆలోచన రావడం అభినందనీయమన్నారు. 10 సంవత్సరాల క్రితం చేసిన సేవను గుర్తించుకోవడం అభినందనీయం అన్నారు. అటువంటి వారిని సైతం నర్సీపట్నం నుండి పిలిచి ప్రత్యేకంగా గౌరవించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్థానిక కాలేజీ ప్రిన్సిపాల్ తో పాటు డివి సూర్యనారాయణరాజు కుమారుడు, మండలంలోని పలువురు విలేకరులు పాల్గొన్నారు.

## డి, ఎల్, డి వో గా సాయి నవీన్ కు అదనపు బాధ్యతలు



అల్లూరిజిల్లా. విజయభాను.పాడేరు: పాడేరు ఎంపిడివో సాయి నవీన్ కు డివిజనల్ లెవెల్ డెవలప్మెంట్ అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేశాయి. దింతో అయన బుధవారం డి ఎల్ డి వో గా అదనపు బాధ్యతలు స్వీకరించారు.

## ఎంవిపి ఇండోర్ స్పోర్ట్స్ ఎరేనా స్టేడియం ప్రారంభోత్సవానికి సిద్ధం చేయండి

విశాఖపట్నం స్మార్ట్ సిటీ నిధులతో నిర్మిస్తున్న ఎంవిపి ఇండోర్ స్పోర్ట్స్ ఎరేనా స్టేడియం ఈ నెల చివరి నాటికి ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం చేయాలని జివిఎంసి కమిషనర్ పి రాజబాబు జివిఎంసి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా 3వ జోన్ పరిధిలోని ఎంవిపి కాలనీ, అప్పుఘర్, శివాజీ పార్కు తదితర ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎంవిపి కాలనీలోని ఏఎస్ఆర్ కాలేజీ గ్రౌండ్ వద్ద సుమారు రూ.20 కోట్ల స్మార్ట్ సిటీ నిధులతో నిర్మించిన ఇండోర్ స్టేడియంను పరిశీలించి స్టేడియం పనులు పూర్తైనందున ఈ నెల చివరినాటికి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం అప్పుఘర్ లో సుమారు రూ.56 కోట్ల స్మార్ట్ సిటీ నిధులతో నిర్మాణంలో ఉన్న 25 ఎంఎల్డి ఎస్టిపి ట్రీట్మెంట్ ప్లాంట్ పనులను పరిశీలించారు. నిర్మాణ పనులు నిర్ణీత సమయానికే పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం శివాజీ పార్క్ ను సందర్శించి పార్కింగ్ ప్రదేశం వద్ద ఉన్న ఖాళీ ప్రదేశాలలో గ్రీనరీ పెంపొందించాలని, పార్కులో సందర్శకులకు ఆహ్లాదం కలిగించే విధంగా విద్యుత్తు, త్రాగునీరు, ఫౌంటైన్, సందర్శకులు కూర్చునేందుకు బెంచీలు, పిల్లలు ఆడుకునేందుకు కావలసిన పరికరాలు మొదలైన మౌలిక సదుపాయాలు సమకూర్చాలని పర్యవేక్షక ఇంజనీర్ వేణుగోపాల్ ను ఆదేశించారు. పార్కులో చిన్న చిన్న మార్పులతో, గ్రీనరీ లాంటి పనులు చేయించాలని మొక్కల విభాగం అధికారి ఎం దామోదర రావును ఆదేశించారు. ఉషోదయ జంక్షన్ ప్రాంత ఆర్పీలతో భేటీ అయి తడి-పొడి మరియు ప్రమాదకరమైన చెత్తపై ఏ విధంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని ఆరా తీశారు. ఆర్పీలు ప్రజలకు తడి-పొడి చెత్త పై ప్రజలకు ఏ విధంగా అవగాహన కల్పించాలో కొన్ని సూచనలు తెలియజేశారు. ప్లానింగ్ కార్యదర్శిలతో వారి వారి పరిధిలో అక్రమ కట్టడాల నిర్మాణాలు జరగకుండా చూడాలని, ఎవరైనా అక్రమ నిర్మాణాలు నిర్మిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ విజయ లక్ష్మి, ఎడి(హార్టికల్చర్) ఎం. దామోదర రావు, ఎసిపి వెంకటేశ్వర రావు, ఎఎంఓహెచ్ డాక్టర్ సునీల్ కుమార్, పర్యవేక్షక ఇంజినీర్లు వి. వినయ్ కుమార్, వేణు గోపాల్, కెవిఎన్ రవి, కార్యనిర్వాహక ఇంజినీర్ ప్రసాద్, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్, సహాయక ఇంజినీర్, శానిటరీ సూపర్వైజర్, శానిటరీ ఇన్స్పెక్టర్లు, అన్ని విభాగాల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# అంధ విద్యార్థుల పాఠశాలలో ఎడ్యుకేషనల్ ఫెయిర్



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : నగరంలోని ఎండాడ ప్రాంతంలో గల మోడల్ అంధ విద్యార్థుల పాఠశాలలో ఎడ్యుకేషన్ ఫెయిర్ అవేర్నెస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంధ విద్యార్థులకు ప్రత్యేకంగా బాలల దినోత్సవం సందర్భంగాఈ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని సెయింట్ లూక్స్ విద్యాసంస్థల ఫైనాన్స్ డైరెక్టర్ షవీలా ప్రీతమ్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనలో అందులో ఉపయోగించే పరికరాలు,సైన్సు ,ఇతర సబ్జెక్టులకు సంబంధించిన చార్టులను, భాషసం బంధిత విషయాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయిని బి సుధారాణి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బి. అర్ మార్క్ రాజ్ మాట్లాడుతూ సాధారణ విద్యార్థులలకు దీటుగా అంధ విద్యార్థులు అన్ని విషయాలలో రాణిస్తారని ఈ ప్రదర్శన ద్వారా అర్థమవుతుందని తెలిపారు. ఈనెల 16 వరకు జరుగుతున్న ఈ ప్రదర్శనను స్థానిక విద్యార్థులంతా తిలకించాలని వారు కోరారు షవీలా ప్రీతమ్ మాట్లాడుతూ ఇంత మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన వారిని అభినందించారు.

మొదటి పేజీ తరువాయి

# నిరంతర అభ్యసనంతో అభివృద్ధి

సృష్టించే స్థాయికి ఎదగాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నిరంతరం ఆకాంక్షిస్తున్నారని చెప్పారు. ఈ లక్ష్యాన్ని చేరుకునే దిశగా ఆంధ్ర విశ్వవిద్యాలయం పనిచేస్తున్న విధానాన్ని విద్యార్థులకు వివరించారు. జియో ఇంజనీరింగ్ విభాగం అద్వితీయమైన ప్రగతిని సాధించిందని హర్షం వ్యక్తం చేశారు. త్వరలో సెంటర్ ఫర్ డ్రోన్ టెక్నాలజీని ఏ యూ లో ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేస్తున్నామని వీటిని విభాగ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన చెప్పారు. సహజ వనరుల సంరక్షణ, వాతావరణ మార్పులను గుర్తించడం ఎంతో అవసరమని విద్యావంతులు ఈ బాధ్యతను స్వీకరించాలని చెప్పారు. విభాగాధిపతి ఆచార్య వజీర్ మహమ్మద్ మాట్లాడుతూ తమ విభాగంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని వర్తమాన సమాజానికి అనుగుణంగా కరికులంలో సైతం తగిన మార్పులు తీసుకు వస్తున్న విధానాన్ని వివరించారు. ఏయూ అధికారులు అందించిన సహకారంతో విభాగంలో తరగతి గదులు, ప్రయోగశాలలు, భవన నిర్మాణ, మరమ్మత్తులు అధునాతన టాయిలెట్స్ రూ 50 లక్షల వ్యయంతో ఏర్పాటు చేశామని చెప్పారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పేరి శ్రీనివాసరావు మాట్లాడుతూ విభిన్న మౌలిక వసతులను పెంపొందించడం జరుగుతోందని, వీటిని విద్యార్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నవ్య ఆలోచనలతో పని చేస్తూ విద్యార్థులు తమ సామర్థ్యాలను రుజువు చేసుకోవాలని చెప్పారు.

ఐఐఐటి శ్రీకాకుళం సంచాలకులు ఆచార్య పి. జగదీశ్వర్ రావు మాట్లాడుతూ జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం భవిష్యత్తులో అద్భుతాలను చేసి చూపుతుందన్నారు. సాటిలైట్లకు ప్రత్యామ్నాయలుగా డ్రోన్స్ నిలుస్తాయని చెప్పారు. స్పేస్ టెక్నాలజీకి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రత్యేక అతిథి డాక్టర్ అర్జిత్ రాయ్ మాట్లాడుతూ నిరంతరం సమాజంలో మార్పులు జరుగుతుంటాయని, వీటిని ఆకలింపు చేసుకుంటూ విద్యార్థులు తమను తాము మెరుగుపరుచుకోవాలని చెప్పారు. జ్ఞానాన్ని అందిపుచ్చుకోవాల్సిన అవసరాన్ని వివరించారు.

కార్యక్రమంలో ఆచార్య అమ్మినీడు తదితరులు ప్రసంగించారు. అనంతరం డ్రోన్ సర్వే కోర్సును పూర్తి చేసిన విద్యార్థులకు విసి ఆచార్య ప్రసాదరెడ్డి స్వయంగా సర్టిఫికెట్లను అందజేశారు.

# ప్రభుత్వలాంఛనాలతో ముగిసిన కృష్ణ అంత్యక్రియలు





కృష్ణ పార్థివదేహం ముందు కదులుతుండగా... వెనుక ఆయన కుమారుడు మహేష్ బాబు, ఇతర కుటుంబ సభ్యులు, సన్నిహితుల వాహనాలు అనుసరిస్తున్నాయి. మహాప్రస్థానంలో కృష్ణ అంత్యక్రియలు జరుగనున్నాయి. తెలంగాణ ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో అంతిమక్రియలు జరగనున్నాయి. మరోవైపు, అంతిమయాత్ర కొనసాగుతున్న మార్గం మొత్తం జనసంద్రమైంది. రోడ్డుకిరువైపులా జనాలు నిలబడి కృష్ణకు వీడ్కోలు పలుకుతున్నారు. జోహార్ కృష్ణ అంటూ నినదిస్తున్నారు.

# సత్తారు మోహన్ రావు నిబద్ధత కలిగిన నాయకుడు

- భాజపా అభివృద్ధికి విశేష కృషి చేసిన వ్యక్తి
- బిజెపి నాయకుడు కె.వి.రమణ ఆధ్వర్యంలో సంతాప సభ



మాధవధార (విజయభాను న్యూస్) : మాధవదార ప్రాంతానికి చెందిన భాజపా దివంగత అధ్యక్షుడు కీ.శే. సత్తారు మోహన్ రావు సంతాప బిజెపి నాయకుడు కె.వి.రమణ ఆధ్వర్యంలో మాధవదార ఉడా కోలనీ ఈస్ట్ పార్క్ వద్ద జరిగింది. ఈ సంతాప కార్యక్రమంలో ఆరెస్సెస్ మాధవదార శాఖ కార్యనిర్వాహక్ క్రృష్ణారావు మాట్లాడుతూ మోహన్ రావు బిజెపీకి ఒక నిబద్ధత గల నాయకుడని,ఆరెస్సెస్ కార్యక్రమాలకు తన సహకారం ఎల్లప్పుడూ ఉండేదని అన్నారు. సీనియర్ బిజెపి కార్యకర్త,రైల్వే ఉద్యోగుల నాయకుడు మూల అప్పారావు మాట్లాడుతూ మోహన్ రావు మృతి బిజెపీకి తీరనిలోటని అన్నారు. ఈ కార్యక్రమంలో భాజపా నగర కార్యదర్శి దూసి రాణి, సనపల రామకృష్ణ, బిజెపి నాయకులు బమ్మిడి గోపాల్, యస్.బంగార్రాజు (జెమినీ), ఆడారి దవళ మాధవ్, నాగరాజు, యస్.రామకృష్ణ, కూన వెంకట్రావు ఇతర నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని ఆ మంచి మనిషికి నివాళు లు అర్పించారు.

# ఎస్ఆర్.రంగనాథన్ ఆదర్శప్రాయులు



మాట్లాడుతున్న రంగరాజు

మాకవరపాలెం (విజయభాను న్యూస్) : గ్రంధాలయ పితామహుడు ఎస్ఆర్.రంగనాథన్ ఆదర్శప్రాయుడనిఇ గౌతమి లలిత కళా శిక్షణ కేంద్రం వ్యవస్థాపకులు పి.రంగరాజు అన్నారు. గ్రంధాలయ వారోత్సవాలలో భాగంగా ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం చదరంగం శిక్షకులు వెంకట సుదీర్ చదరంగం పోటీలను ప్రారంభించి చదరంగం ఆడుట వలన మైండ్ అభివృద్ధి చెందుతుందన్నారు. గౌతమి శిక్షణ కేంద్రం కార్యదర్శి ఎం.శేషగిరిరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో గ్రంధాలయాభివృద్ధికి అయ్యంకి వెంకట రమణయ్య, పోతూర నాగభూషణం ప్రసిద్దులన్నారు. గ్రంధాలయాధికారిణి చంద్రకళ మాట్లాడుతూ గ్రంధాలయ ఉద్యమంలో పాల్గన్న నాయకులను కొనయాడారు. గ్రంధాలయంలో సభ్యత్వం ప్రతీ ఒక్కరూ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ పాఠశాల పిడి ప్రసాద్, గ్రామ పెద్దలు లాలం రాము, బివి.సత్యనారాయణ, సుమారు వంద మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్ల పంపిణీ

## - ఎంఈఓ ఎస్.అప్పలరాజు



సబ్బవరం (విజయభాను న్యూస్) : మండల కేంద్రంలోని సబ్బవరం ప్రభుత్వ పాఠశాలల లో 8,9,10 తరగతులు చదుచున్న విద్యార్థులకు రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 10వ తేదీన మండల స్థాయిలో ఆన్లైన్ లో నిర్వహించే "కౌశల్-2022" పరీక్షలలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల సబ్బవరం విద్యార్థులు డి. లహరి 10వ తరగతి 30/40,బి.మోన్షిత 9వ తరగతి 38/40,బి. లుహాసిని 8వ తరగతి 41/45 మార్కులతో ఉత్తీర్ణత సాధించారు.మొత్తం 109/125 మార్కులతో జిల్లాలో ప్రభత్వ ఉన్నత పాఠశాల సబ్బవరం కు ద్వితీయ స్థానం లో నిలిచిందని ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయులు సిహేచ్. చిన్నమ్మాయి ఒక ప్రకటనలో తెలయజేశారు. వీరు ఈ నెల 26న కశింకోట, అనకాపల్లి జిల్లాలో ఆన్లైన్ లో జరిగే జిల్లాస్థాయి కౌశల్ -2022 పరీక్షలకు హజరు కానున్నారు. ఈ సంధర్భంగా ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు మండల విద్యా శాఖాధికారి బుధవారం యస్.అప్పలరాజు మెరిట్ సర్టిఫికెట్లు అందజేసి విద్యార్థులను, వారిని ప్రోత్సహించిన ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పేరెంట్ కమిటీ సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల చెంతకే మెరుగైన వైద్య సేవలు

## - సర్పంచ్ రొంగలి వెంకటరావు



దేవరాపల్లి,(విజయభాను న్యూస్) : గ్రామీణ పేదల ఆరోగ్య దృష్ట్యా సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి కార్యక్రమంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంతో నేరుగా ఇళ్ల వద్దకే మెరుగైన వైద్యం అందుతుందని సర్పంచ్ రొంగలి వెంకట రావు (నీలిమ) అన్నారు. వేచలం పీహెచ్సీ ఆధ్వర్యంలో కొత్తపెంటలో వైద్య శిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ పేదల పాలిటి సంజీవనిగా నిలుస్తుందని అన్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారి గోవిందరెడ్డి రోగులను పరీక్షించి కచ్చితంగా మందులు పంపిణీ చేశారు. దీర్ఘ కాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఇంటికి వెళ్లి వైద్య సేవలు అందించారు.

ఈ కార్యక్రమం లో వైస్సార్ సీపీ నాయకులు మాజీ సర్పంచ్ రొంగలి శంకరరావు, చిరికి శంకరరావు, వేచలం పీహెచ్సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# అభయ అంజనేయస్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే పంచకర్ల

## పంచకర్లకు చిత్రపటాన్ని బహూకరించిన అలయ కమిటి పెద్దలు



పరవాడ (విజయభాను న్యూస్) : జివిఎంసి 79వ వార్డు లంకలపాలెం అభయ ఆంజనేయ స్వామి వారిని పెందుర్తి మాజీ శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసారు. ఆలయకమిటి సెక్రటరీ మడక రమేష్ నాయుడు గ్రామపెద్దలు మాజీ ఎమ్మేల్యే పంచకర్లకు చిత్రపటాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా పంచకర్ల మాట్లాడుతూ ప్రతిఏటా అంజనేయస్వామి వార్షికోత్సవ వేడుకులు ఘనంగా నిర్వహిస్తున్నారు అని కొనియాడారు. ఇటువంటి వేడుకుల్లో నీను కూడా పాల్గోనడం ఏంతో అనందించదగ్గ విషయమనీ అన్నారు.ఈ కార్యక్రమంలో సుందరపు అప్పారావు, పచ్చికోరు రమణమూర్తి,బొద్దపు వెంకటరమణ, బుగిడి గోవింద, కావలి వాసు, చలపరెడ్డి రామారావు, బంధం రమణ, మడక రాజునాయుడు, పిల్ల అప్పారావు, గొంతిన నాగేశ్వరరావు,నానితదితరులు పాల్గోన్నారు.

# సీజనల్ వ్యాధులు పట్ల ప్రజలు అందరూ అప్రమత్తంగా ఉండాలి

## 79వవార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనువాస్ వెల్లడి



పరవాడ (విజయభాను న్యూస్) : సీజనల్ వ్యాదులుపట్ల ప్రజలు అందరూ అప్రమత్తంగా ఉండాలానీ 79వ వార్డు కార్పొరేటర్ రౌతుశ్రీనువాస్ కోరారు.

స్వచ్ఛ సర్వేక్షన్ లో భాగంగా 79 వ వార్డు దేశపాత్రునిపాలెం లో తడి ,పొడి, మరియు ప్రమాదకరమైన చెత్తను వేరుచేసి విడివిడిగా చెత్త డబ్బాల్లో వేసి జీవీఎంసీ వాహనానికి అందించాలని 79 వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ ప్రజలుఅందరికీ పిలుపునిచ్చారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో వార్డు టిడిపి అద్యక్షులు మచ్చాశివ, టిడీపీ నాయకులు జాజుల చిన్నా రావు, వార్డ్ సానిటరీ ఇన్స్పెక్టర్, మరియు సచివాలయ సిబ్బంది, సానిటరీ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# రామాలయం లో స్వాములకు అన్నదానం ను ప్రారంభించిన

## డి ఎల్ డి ఎ చైర్మన్ గాడు వెంకటప్పడు



భీమునిపట్నం (విజయభాను న్యూస్) : శ్రీ అయ్యప్ప స్వామి సేవ పీఠం. డొకర పేట 41 రోజులు నిత్య అన్నదాన కార్యక్రమం అక్టోబర్ 19న ప్రారంభమై ఈనెల 28 వరకు జరుగుతున్న నేపథ్యంలో బుధవారం అన్నదాన కార్యక్రమం ను డి ఎల్ డి ఎ చైర్మన్ మరియు భీమిలి జెడ్పీ టి సి గాడు.వెంకటప్పడు ,సర్పంచ్ గాడు వెంకటనారాయణ దంపతులు ప్రారంభించారు. ప్రతిరోజు వివిధ రకాల రుచులతో ఇక్కడ అయ్యప్ప స్వామియే పరితపించే విధంగా నిర్వాహకులు చేస్తున్నటువంటి కార్యక్రమం వర్ణనాతీతం ఎందుకంటే రోజుకి సుమారు 750 నుంచి 800 అయ్యప్ప స్వామి భక్తులు, భవాని దీక్షాపరులు, శివ భక్తులు ఈ యొక్క కార్యక్రమానికి వస్తున్నారంటే అతిశయోక్తి కాదు.ఇక్కడ బిక్షళ ఒక్కసారైనా తిని వెళ్ళాలి అని స్వామీలు భవాని లు అనుకుంటున్నారని అయ్యప్ప స్వామి పీఠం సభ్యులు అంటున్నారు. ముప్పయి మంది మహిళలు రోజంతా నియమ నిష్టలతో ఇక్కడ బిక్షకు ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో డి ఎల్ డి ఎ చైర్మన్ మరియు భీమిలి జెడ్పీ టి సి గాడు వెంకటప్పడు సతీమణి అలివేలు, సర్పంచి సతీమణి సత్య, గ్రామ పెద్ద గాడు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

# ఝాన్సీ లక్ష్మీభాయి జయంతి వేడుకలు



యానాం (విజయభాను న్యూస్) : యానాం కేంద్ర పాలిత ప్రాంతం యానం నియోజవర్గంలో వీరవనిత ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఫెర్రీ రోడ్ లో గల ఝాన్సీ లక్ష్మీబాయి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించిన, ప్రాంతీయ పరిపాలన అధికారి మునిస్వామి మాట్లాడుతూ.. వీరవనిత ఝాన్సీ లక్ష్మీబాయి యుద్ధ పటిమను యువత ఆదర్శంగా తీసుకోవాలని, ఆమె జాతిగా చేసిన మేలులను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో యానం ఎస్పి రఘునాయిగన్, సిఐ శివ గణేష్, ఎస్ఐ కనకారావు, పిఆర్వో, కొల్లు ప్రసాదు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# శ్రీకృష్ణ ఆలయం నిర్మాణానికి తనవంతు ఆర్థిక సాయం అందిస్తా

## - మాడుగుల నియోజకవర్గ టీడీపీ నాయకులు పైలా ప్రసాదరావు



దేవరాపల్లి,(విజయభాను న్యూస్) : మండలంలోని చింతలపూడి శిధిలావస్థలో ఉన్న శ్రీకృష్ణ విగ్రహం స్థానంలో తనవంతు ఆర్థిక సాయం అందిస్తానని మాడుగుల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు పైలా ప్రసాదరావు ఆమె ఇచ్చారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు బుధవారం చింతలపూడి గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ గ్రామ పరిస్థితిలు, వారి ఉపాధి అంశాలపై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు పూజించే శ్రీకృష్ణ విగ్రహాన్ని దర్శించుకుని పూజించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి సహకరించాల్సిందిగా పైలా ను గ్రామస్తుల కోరారు. ఆలయ నిర్మాణానికి సంపూర్ణ ప్రణాళిక తయారు చేసుకోవాల్సిందిగా సూచించారు. తనవంతుగా ఆలయ నిర్మాణానికి సహకారం అందించి భాగస్వామినవుతానని హామీ ఇచ్చారు. పైల హామీకి స్పందిస్తూ గ్రామస్తులు నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దాయిరి దేముడు, దాయిరి లక్ష్మణ్, ములగం నారాయణ, మాడుగుల నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కర్రీ నాయుడు, పైలానాయుడు, లెక్కల సత్యనారాయణ, మండల పైలా యువసేన అధ్యక్షుడు గట్రెడ్డి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.



యానాం నియోజకవర్గ నందు ఉమా ఎడ్యుకేషనల్ & టెక్నికల్ సొసైటీ ద్వారా నిర్వహిస్తున్న మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాలను చైల్డ్ లైన్ ప్రాజెక్టను యానం ప్రాంతీయ పరిపాలన అధికారి అర్. ముని సామి సందర్శించి అక్కడ జరుగుతున్నటువంటి కార్యక్రమాలను చూడడం జరిగింది సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్. పి రెడ్డి మానసిక వికలాంగులకు ఎలాంటి ప్రత్యేక వసతులతో విద్యను అందిస్తున్నారు అలాగే చైల్డ్ లైన్ ద్వారా ఆపదలో ఉన్న పిల్లలు ఏ విధంగా రక్షిస్తున్నారు అనే విషయాలను ఆయనకు వివరించడం జరిగింది ఇందు ఆయన వెంట సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ రెయ్య శ్రీనివాసరావు, ఉమా ఎడ్యుకేషనల్ %డ% టెక్నికల్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ నారాయణ రెడ్డి ,చైల్డ్ లైన్ కో.ఆర్డినేటర్ కె.శ్రీనివాస్ ,సిబ్బంది పాల్గొన్నారు.

# ఐసిడిఎస్ పిడి సూర్యలక్ష్మీ పర్యటన



కొయ్యూరు (విజయభాను న్యూస్) :ఐసిడిఎస్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ సూర్యలక్ష్మి కొయ్యూరు ప్రాజెక్టును బుధవారం సందర్శించారు. అనంతరం రాజేంద్రపాలెం అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీ బాలింతలతో మాట్లాడి వారికి అందించే కిట్ గురించి స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రతి గర్భిణీ జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో చైల్డ్ రైట్స్ మీద అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సింహాచలం, సిడిపిఒ విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.


# బాధితులకు ఆర్థిక సహాయం

## 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : అల్లిపురం ఏడుగుళ్ళు కు చెందిన లక్ష్మణ్రావు మృతిచెందిన సమాచారంతో జీవీఎంసీ 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు మృతుని భార్య పూర్ణిమ,పిల్లలు గాయత్రి,ధనుష లను పరామర్శించి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మంగళవారం తన కార్యాలయంలో మృతుని కుటుంబసభ్యులను కలిసి ధైర్యంగా ఉండాలని ధైర్యవచనాలు చెప్పి ఆర్థిక సహాయ మందించారు. ఆపదలో అండగా నిలిచిన నాగరాజుకు మృతుని కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ధన్యవాదాలు చెప్పారు. నిస్వార్థంగా పేదలకు సేవలందిస్తూ పిలిస్తే పలికే నాగరాజు వంటి వ్యక్తి అరుదుగా ఉంటాడని కొనియాడారు.అయన సేవలు విశాఖ దక్షిణ నియోజకవర్గమంతటా విస్తరించాలని, నాగరాజు రాజకీయంగా ఉన్నత పదవులు చేపడితే ప్రజలకు మరింత మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు.ప్రజలకు అందుబాటులో వుండే నాగరాజు తమ వార్డులో నివసించడం వార్డు ప్రజలు చేసుకున్న అదృష్టమన్నారు.ఈ కార్యక్రమంలో మహేష్ ,లారా,ఉమ, విజయ,పూజ ,ప్రేమ్, తవుడమ్మ,కుమారి పాల్గొన్నారు.

## బోయిలకింతాడ లో ఇంటింటి వైద్య సేవలు



దేవరాపల్లి,(విజయభాను న్యూస్) : మండలంలోని బోయిల కింతాడ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన ఇంటింటి వైద్య సేవలు (ఫ్యామిలీ ఫిజీషిన్) గ్రామ సర్పంచ్ బూరె బాబురావు మంగళవారం ప్రారంభించారు. వేచలం పీహెచ్సీ వైద్యులు డి. గోవింద్ రెడ్డి గ్రామంలో వైద్య సేవలను ప్రారంభించారు

# విజయభాను

## సంపాదకీయం

### నిరర్థక పని

ప్రధాని నరేంద్ర ఆంధ్రప్రదేశ్ పర్యటన రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను మరో మారు వమ్ము చేసింది. మోడీ టూర్ కోసం ఎ.పి. ప్రభుత్వం చేసిన కోట్లాది రూపాయల వ్యయం, సమయం వృధా ప్రయాసగా మిగిలిపోయింది. ప్రధాని రాష్ట్రానికి వస్తున్నారంటే, ఏమేమి వరాలిస్తారోనన్న ఉత్సుకత సహజంగానే ప్రజల్లో కలుగుతుంది. రాష్ట్ర విభజనతో సతమతవుతున్న మనకైతే ఆ ఉత్సుకత ఇంకా ఎక్కువగా ఉంటుంది. పార్లమెంట్ పాస్ చేసిన విభజన చట్టం అమలు, ఆ సమయంలో ఇచ్చిన హామీలు, వాటికి తోడు కేంద్ర విధానాల్లో భాగంగా విశాఖ ఉక్కు మెడపై వేలాడుతున్న ప్రైవేటీకరణ కత్తి వంటి ఎన్నెన్నో జటిల సమస్యలపై ప్రధాని వివరణ ఇస్తారని ప్రతి ఒక్కరూ ఆశిస్తారు. కానీ మోడీ తన పర్యటనలో వాటి ఊసెత్తకపోవడంతో ఆయనది నిరర్థక పర్యటనే అయింది. ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు పరిమితమైంది. అవేమీ కొత్తవేం కాదు. ఆ మాటకొస్తే ప్రధాని శంకుస్థాపనలకు విలువే లేదనడానికి ప్రత్యక్ష ఉదాహరణ రాజధాని అమరావతి. అమరావతిలో రాజధాని నిర్మాణానికి భూమి పూజ చేసి, ఢిల్లీని తలదన్నే రాజధానిని నిర్మిస్తామని చెప్పి, ఎనిమిదేళ్లల్లో రూ.2,500 కోట్లివ్వడం గగనమైంది.

హైదరాబాద్‌ను కోల్పోవడంతో ఎ.పి. పారిశ్రామికంగా ఏమీ లేని రాష్ట్రమైంది. పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామన్నారు మోడీ, ఆయన పార్టీ బిజెపి. అనంతరం హోదా అనేది ముగిసిన అధ్యాయమని మాట తప్పారు. విశాఖలో రైల్వే జోన్ అన్నారు. ఇన్నేళ్లయినా నిర్మాణ పనులకు శంకుస్థాపన కూడా చేయలేదు. విశాఖ వచ్చిన మోడీకి ఆ విషయం గుర్తు లేక కాదు, కావాలనే విస్మరించారు. ఎందరో త్యాగాలు, బలిదానాలతో సాధించుకున్న వైజాగ్ స్టీల్‌ను కేంద్రం అమ్మేస్తామనడంతో కార్మికులు ఏడాదిన్నరకుపైగా ఆందోళనలు చేస్తున్నారు. విశాఖ అభివృద్ధికి తలమానికంగా ఉన్న వైజాగ్ స్టీల్ గురించి ప్రస్తావించకుండా సమ్మిళిత వృద్ధి అంటే ప్రజలెలా నమ్ముతారు? విశాఖలో మెట్రో రైలు అంశం విభజన చట్టంలో పొందుపర్చగా అతీగతీ లేదు. విశాఖను ప్రపంచంలోనే అతి పెద్ద వ్యాపార కేంద్రంగా మారుస్తామనడం ఎవరిని మభ్యపెట్టడానికి? వెనకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ అభివృద్ధికి ఇస్తామన్న నిధులను ఎగ్గొట్టారు. ఉన్న వైజాగ్ స్టీల్‌ను అమ్మకానికి పెట్టి కడపలో స్టీల్ ఫ్యాక్టరీకి ఎగనామం పెట్టారు. విభజన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయకుండా రాష్ట్రానికి అన్యాయం చేసిన ప్రధాని తెలుగు ప్రజల సుఖ సంతోషాలు కోరుకోవడం పెద్ద దగా.

రాష్ట్రానికి అన్ని విధాలా అన్యాయం చేసిన కేంద్ర బిజెపి ప్రభుత్వాన్ని, ప్రధాని మోడీని రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నిలదీయకపోవడం అభ్యంతరకరం. 'కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోడీతో మా బంధం రాజకీయాలకు అతీతం. రాష్ట్ర ప్రయోజనాలు తప్ప వేరే ఎజెండా మాకు లేదు' అని సభా ముఖంగా ప్రకటించిన జగన్, రాష్ట్రానికి ద్రోహం చేసినా బంధాన్ని కొనసాగించడానికి కారణమేంటో వెల్లడిస్తే బాగుండేది. కేంద్రాన్ని 'అడుగుతూనే ఉంటాం' అన్న జగన్ విశాఖ సభలోనూ అదే పని చేశారు తప్ప గట్టిగా మోడీని నిగ్గదీసింది లేదు. మోడీతో ఏకాంతంగా సమావేశమైన పవన్ కళ్యాణ్, రాష్ట్రానికి అన్యాయం చేసిన ప్రధానిని ప్రశ్నించినట్లేమీ కనబడలేదు. ప్రతిపక్ష టిడిపి సైతం కేంద్రాన్ని, మోడీని గట్టిగా డిమాండ్ చేసింది లేదు. రాష్ట్రానికి బిజెపి చేసిన ద్రోహాన్ని ప్రశ్నించేందుకు సిద్ధమైన వామపక్షాలను రాష్ట్ర ప్రభుత్వం పోలీసులతో నిలువరించింది. విశాఖ ఉక్కు పరిరక్షణకు ఉద్యమిస్తున్న కార్మిక సంఘాల నేతలను అరెస్టు చేసింది. తతిమ్మా రాష్ట్రాల్లో కేంద్రం చేస్తున్న అన్యాయాలపై ప్రభుత్వాలు, అక్కడి పార్టీలు వ్యతిరేకిస్తుండగా, మన దగ్గర అందుకు భిన్నంగా అధికార, ప్రధాన ప్రతిపక్షాలు నోరెత్తట్లేదు. రాష్ట్రానికొచ్చిన ప్రతిసారీ తెలుగు ప్రజల తెగువను ఆకాశానికెత్తడం ప్రధానికి రివాజైంది. రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిన బిజెపిపై తెలుగు ప్రజలు తెగువ ప్రదర్శించి తమ సత్తా నిరూపించాలి.

## రాష్ట్రంలో వెలమజాతి సీఎం జగన్ కు రుణపడి ఉంటుంది

**- రాష్ట్రంలోని 16 జిల్లాల్లో 35 లక్షల పైచిలుకు వెలమజాతి**

**- ఉత్తర సమీక్ష సమావేశంలో సీఎం జగన్ తో రాష్ట్ర కార్యదర్శి రొంగలి బేటీ**





విశాఖపట్నం (విజయభాను న్యూస్): ఆంధ్రప్రదేశ్లో ఉన్న ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణాజిల్లాలలో కలిపి 16 జిల్లాలలో ఉన్న వెలమ సామాజిక వర్గానికి చెందిన ప్రతి ఒక్కరు సీఎం జగన్ కి రుణపడి ఉంటామని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాథం తెలియజేశారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ని తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో విశాఖ ఉత్తర నియోజకవర్గ సమీక్ష సమావేశంలో కలవడం జరిగింది.

ఈ కార్యక్రమంలో శృంగవరపుకోట మరియు విశాఖ ఉత్తర నియోజకవర్గాల గురించి మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర ప్రాంతంలో అత్యధిక జనాభా గల వెలమ జాతిని ఉద్దేశించి వైయస్ఆర్ సిపి రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాధం ముఖ్యమంత్రి తో మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ లో సుమారు 35 లక్షల పైచిలుకు జనాభాగల వెలమ జాతి ముఖ్యంగా విశాఖ నగరంలో 3.50 లక్షల పైచిలుకు జనాభా అందులోనూ విశాఖ ఉత్తర, గాజువాక, పెందుర్తి నియోజకవర్గాలలో అత్యధిక వెలమ జనాభా ఉన్నందున, త్వరలో విశాఖ పరిపాలన రాజధానిగా రూపు దిద్దుతున్న తరుణంలో సుమారు 2000 గజముల స్థలమును ఈ జాతి అభ్యున్నతికై కేటాయించమని కోరడం జరిగినది, దానికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి స్పష్టమైన హామీ ఇవ్వడం జరిగినది,ఈ సందర్బంగా రొంగలి జగన్నాధం ముఖ్యమంత్రి హామీకి హర్షం వ్యక్తం చేస్తు, వెలమజాతి మొత్తం వారికి రుణపడి ఉంటుందని, వెలమజాతి చరిత్రలో ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని, వెలమజాతి మొత్తం మీ వెంటే ఉంటుందనీ, వెలమజాతి మొత్తం తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు.

## ధనికుల ఇళ్లల్లో అవసరం లేని ఆటవస్తులను సేకరించి మురికివాడల్లో పిల్లలకు ఇవ్వండి

**పీఎం మోడీ ఆదేశానుసారం బిజెపి మహిళా మోర్చా వినూత్న కార్యక్రమం**



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విశాఖ పర్యటన సందర్భంగా నరేంద్ర మోడీ ఆదేశానుసారం స్టేట్ మహిళా మోర్చా కు ఒక కార్యక్రమాన్ని నిర్వహించ మని చెప్పడం జరిగింది వ్యాపారవేత్తలు ధనికుల ఇళ్లల్లో వాళ్లకి అవసరము లేనిఆట వస్తువులను సేకరించి మురికివాడలలో గ్రామాలలో పేద ప్రజల పిల్లలకు పంపిణీ చేయమని తద్వారా గర్భిణీ స్త్రీలకు పిల్లలకు పౌష్టికాహారం అందేలా అంగన్వాడీ కేంద్రాల ద్వారా మరియు క్రింద స్థాయి ప్రజలకు చేరువుగా సుకన్య పథకాన్ని బేటి పడావో బేటీ బచావో జీవన్ జ్యోతి పౌష్టికాహారానికి సంబంధించి సమాచారాన్ని కింద స్థాయి వరకు తీసుకుని వెళ్లాలని సూచించడం జరిగింది. ఈరోజు మహిళా మోర్చా అధ్యక్షురాలు ఉమ్మడి సుజాత రాజ్ ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజ్యసభ సభ్యులు జీవీఎల్ మరియు రాష్ట్ర మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి ప్రేమ కుమారి, జిల్లా ప్రధాన కార్యదర్శి మరియు మహిళా మోర్చా ఇన్చార్జ్ దిలీప్ వర్మ ముఖ్య అతిథులుగా పాల్గొని జీవీఎల్ నరసింహారావు దిశ నిర్దేశం ఏ విధంగా చేయాలని సూచించడం జరిగింది ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా కమిటీ సభ్యులందరూ పాల్గొనడం జరిగింది.

## కవి సమయం

### దుష్టులకు దూరంగా వుండవలెను

దుష్టులతో స్నేహం చేస్తే మనకూ అదే విధమైన పేరు వస్తుంది. మీరు మంచివారయినా మీ సావాసగాళ్ళు చెడ్డవారైతే మిమ్మల్ని కూడా చెడ్డవారిగానే ఈ లోకం పరిగణిస్తుంది. తాడిచెట్టు క్రింద కూర్చుని పాలు త్రాగినా కల్లు తాగుతున్నాడనే అంటారు. అంటే దుష్టుల ఛాయకు అంత చెడ్డపేరు వుందన్నమాట. చెడ్డవారితో స్నేహం మొదలు బాగానే వుంటుంది. కానీ చివరకు వ్యసనాలను, అనేకమైన ఇతర దుర్గుణాలనూ నేర్పిస్తుంది. కాబట్టి చెడ్డవారికి దూరంగా వుండటం మంచిది. ఈ విషయాన్ని ఓ వేమన పద్యం ద్వారా విందాం.

'కానివానితోడు గలసి మెలుగుచున్న
గానివానివలెనె కాంతురవని
తాడిక్రిందుబాలు త్రాగిన చందమౌ
విశ్వదాభిరామ వినురవేమ'

... రచయిత
వడ్లమాని అన్నపూర్ణ

## పంచాంగం

| మాసం : కార్తీక; తిథి : నవమి తె.5.41; మఘ సా.6.42, ఉ.శే.వ.7.22వ తె.వ.3.17ల 5.00 | గురువారం 17-11-2022 |
|---|---|

a **మేషం** : కొంతమంది సూటిపోటి మాటలు పడటం వల్ల మానసిక ఆందోళనకు గురవుతారు. పాత వస్తువులను కొని ఇబ్బందులను ఎదుర్కొంటారు. ట్రాన్స్‌పోర్టు, ట్రావెలింగ్ రంగాల వారికి కలిసిరాగలదు. దూర ప్రాంతాలకే చేయు ప్రయత్నాలు ఫలిస్తాయి. b **వృషభం** : ధనం ఏమాత్రం నిలబెట్టలేక పోయినా ఆర్థిక ఇబ్బంది అంటూ ఏదీ ఉండదు. సాంస్కృతిక, సేవా కార్యక్రమాల్లో చురుకుగా వ్యవహరిస్తారు. అకాల భోజనం, ప్రశాంతత లోపం వల్ల ఆరోగ్యం మందగిస్తుంది. కాంట్రాక్టర్లకు, బిల్డర్లకు పనివారలతో సమస్యలు తలెత్తుతాయి. రిజిస్ట్రేషన్లకు ఇది అనువైన సమయం కాదు.C **మిథునం** :మీరు చేసే పనులకు బంధువుల నుంచి విమర్శలు, వ్యతిరేకత ఎదుర్కొనక తప్పదు. ముఖ్యులకు బహుమతులను అందజేస్తారు. రాబోయే కాలంలో ఖర్చులు, అవసరాలు మరింత పెరిగేందుకు ఆస్కారం ఉంది. నిరుద్యోగులకు ఉపాధి పథకాలు సంతృప్తికరంగా సాగుతాయి. వాగ్వివాదాలకు దూరంగా ఉండటం మచిది.d **కర్కాటకం** : ప్రముఖులను కలుసుకుని బహు మతులను అందజేస్తారు. మధ్యవర్తిత్వం వహించుట వల్ల ఇబ్బందులను ఎదుర్కొం టారు. మీలోని శక్తిసామర్థ్యాలు ద్విగుణీకృతమయ్యే అవకాశం దక్కుతుంది. ఉపాధ్యాయులకు మంచి గుర్తింపు లభిస్తుంది. వృత్తి, ఉద్యోగాలలో వారికి ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. ధన లబ్ధి పొందుతారు.e **సింహం** : ప్రైవేటు సంస్థలలోని వారికి ప్రతి విషయంలోనూ ఓర్పు , లౌక్యం అవసరం. మీ అభిరుచులకు తగిన వ్యక్తులతో పరిచయాలు పెంచుకుంటారు. విదేశాలకు వెళ్లడానికి చేయు యత్నాలు ఫలిస్తాయి. స్త్రీలకు పనివారితో చికాకులు ఎదురవుతాయి. ఉద్యోగస్తుల హోదా పెరగడంతో పాటు... బరువు బాధ్యతలు అధికమవుతాయి. f**కన్య** :ప్రభుత్వ కార్యక్రమాలలోని పనులు అనుకూలిస్తాయి. స్త్రీలకు షాపింగ్, వ్యవహారాలలో మెళకువ అవసరం. నిరుద్యోగులకు బోగస్ ప్రకటనలు, కొత్త వ్యక్తుల పట్ల అప్రమత్త అవసరం. గృహంలో చికాకులు తొలగి ప్రశాంతత నెలకొంటుంది. మీ సంతానం కోసం ధనం బాగా వ్యవం చేయవలసి వస్తుంది.g **తుల** : ఇప్పటివరకు విరోధులుగా ఉన్న వ్యక్తలను సుముఖం చేసుకోగలుగుతారు. ప్రేమికులు పెద్దల ఆగ్రహావేశాలకు గురికావలసి వస్తుంది. వాహన చోదకులకు ఆటంకాలు తప్పవు. బంధు మిత్రులతో మనస్పర్థలు తలెత్తు తాయి. చేతి వృత్తి వ్యాపారులకు లాభదాయకం. రాజకీయ రంగాల వారికి గుర్తింపు, రాణింపు లభిస్తుంది.h **వృశ్చికం** : ఉద్యోగస్తులు కొత్త బాధ్యతలు స్వీకరిస్తారు. పెద్దల ఆరోగ్య, ఆహార విషయాల్లో మెళకువ అవసరం. ఉత్తర ప్రత్యుత్తరాలు సంతృప్తినిస్తాయి. మిత్రుల కారణంగా మీ కార్యక్రమాలు మార్చుకోవలసి వస్తుంది. బంధువుల రాక వల్ల ఖర్చులు అధికమవుతాయి. సిమెంట్, ఇసుక, ఐరన్, కలప వ్యాపారులకు పురోభివృద్ధి.i **ధనుస్సు** :వ్యాపారాల్లో నూతన భాగస్వాములను చేర్చుకునే విషయంలో బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోవలసి వస్తుంది. పత్రిక, ప్రైవేటు సంస్థలలోని వారికి యాజమాన్యం తీరు నిరుత్సాహం కలిగిస్తుంది. విద్యార్థుల ఆలోచనలు పక్కదారి పట్టే ఆస్కారం ఉంది. దైవ కార్య క్రమాలకు కుటుంబీకులతో ఉల్లాసంగా గడుపుతారు.j **మకరం** : ఉద్యోగస్తుల శక్తి సామర్థ్యాలను అధికారులు గుర్తిస్తారు. మీ శ్రీమతి సలహా పాటించడం చిన్నతనంగా భావించకండి. విద్యా, వైజ్ఞానిక విషయాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. విలాస వస్తువులు అమర్చుకోవాలనే స్త్రీల కోరికలు నెరవేరుతాయి. కాంట్రాక్టర్లకు ఇంజనీరింగ్ అధికారుల నుంచి అభ్యంతరరాలెదుర్కోవలసి వస్తుంది.k **కుంభం** :చిన్నాటి మిత్రులను, ప్రియమైన వ్యక్తులను కలుసుకుంటారు. మీ జీవిత భాగస్వామి సలహా తీసుకోవడం శ్రేయస్కరం. మీ కళత్ర మొండివైఖరి మీకు ఎంతో చికాకు కలిగిస్తుంది. ప్రైవేటు సంస్థలలోని వారికి ఓర్పు, నేర్పు పరీక్షా సమయం. అనవసరపు వాగ్దానాలు చేసి సమస్యలు తెచ్చుకోకండి. రుణ యత్నాలు వాయిదా పడతాయి. దూర ప్రయాణాలు విసుగు కలిగిస్తాయి. L **మీనం** : వ్యాపారంలో పెరిగిన పోటీని తట్టుకోవడానికి అహర్నిశలు శ్రమిస్తారు. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. రుణ బాధలు తొలగుతాయి. నిరుద్యోగులకు ఇంట ర్వ్యూలు, రాత పరీక్షలలో మెళకువ, ఏకాగ్రత అవసరం. పత్రాలకు సంబంధించిన విషయాలలో ఏకాగ్రత ముఖ్యం. ఉద్యోగస్తులకు అదనపు బాధ్యతలను స్వీకరిస్తారు.

## గ్రంథాలయాలను ప్రజలు వినియోగించుకోవాలి

**- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్పర్సన్ కొండా రమాదేవి**



ములగాడ (విజయభాను న్యూస్ ): శాఖ గ్రంథాలయాలను ప్రజలు వినియోగించుకోవాలని, తద్వారా తద్వారా జ్ఞానాన్ని, ఉపాధిని పొందాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్పర్సన్ కొండా రమాదేవి అన్నారు. మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో బుధవారం ఆమె ముఖ్య అతిథిగా ప్రసంగిస్తూ- గ్రంథాలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. త్వరలోనే గ్రంథాలయానికి ఎయిర్ కండిషన్ సదుపాయం కల్పిస్తామని ప్రకటించారు. సమావేశంలో గౌరవ అతిథిగా పాల్గొన్న వై.ఎస్.ఆర్. సిపి జిల్లా యువజన అధ్యక్షులు కొండా రాజీవ్ గాంధీ మాట్లాడుతూ- గ్రంథాలయాల అభివృద్ధికి ప్రజలు, ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు కలసి మెలసి పనిచేయాలని అన్నారు. నిస్వార్థంతో చేసే ప్రతి సేవా కార్యక్రమం ఏదో ఒక రూపంలో లాభాన్ని తెచ్చిపెడుతుందని అన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయానికి ఉచితంగా 30 కుర్చీలను బహుకరించిన రాముకు జిల్లా గ్రంథాలయం సంస్థ తరపున కృతజ్ఞతలు తెలియజేసి ఆయనను సన్మానించారు. సమావేశంలో జి. కె.వి. రాజు, సత్తిరాజు, బి.సత్య నంద%శీ%, జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి, గ్రంథాలయాధికారి వి.అజయ్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్.సి.హెచ్.వెంకట్రావు, డిప్యూటీ లైబ్రరీ శ్రీ పి.నూకరాజు, డోనర్ శ్రీ రాము తదితరులు ప్రసంగించారు. గ్రంథాలయ ఉద్యమానికి ఎంతో కృషి చేసిన అయ్య%శీ%కి వెంకట రమణయ్య, ఎస్.ఆర్.రంగనాథన్ తదితరుల గురించి ఈ సమావేశంలో చర్చించారు. గ్రంథాలయ ఉద్యమానికి వారు చేసిన సేవలను కొనియాడారు. అంతకుముందు గ్రంథాలయ ఉద్యమకారుల చిత్రపటానికి కొండా రమాదేవి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. సమావేశంలో భాగంగా హైస్కూల్ విద్యార్థులకు, సెయింట్ ఆన్స్ కళాశాల విద్యార్థులకు చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. కార్యక్రమాలను గ్రంథాలయాధికారి అజయ్ కుమార్ సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ విద్యార్థులు ,సెయింట్ ఆన్స్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# 2వ వార్డులో డ్రైనేజీ సమస్యలను పరిశీలించిన

## భీమిలి జోన్ కమిషనర్ వెంకటరమణ



భీమునిపట్నం (విజయభాను న్యూస్) : జీవిఎంసీ భీమిలీ జోన్ 2వ వార్డులో పలు డ్రైనేజీ సమస్యలను పరిశీలించిన భీమిలి జోన్ కమిషనర్ వెంకటరమణ ఈ సందర్భంగా 2వ వార్డు సీనియర్ నాయకులు శిల్లా కరుణాకర్ రెడ్డి బ్యాంకోలని, డెక్కతిపాలెం గ్రామంలో గల డ్రైనేజి సమస్యలను తద్వారా ప్రజలు ఎదురుకుంటున్న ఇబ్బందులను వివరించారు. అలానే సంతపేట ఆదర్శనగర్ సచివాలయం దగ్గిర గల డ్రైనేజీ సమస్య పై కూడా భీమిలి ఏసీపీ శాస్త్రి సుభాన్ సానుకూలంగా స్పందించారు. త్వరలో చెప్పిన ప్రతీ సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ డ్రైనేజి సమస్య లేని వార్డుగా 2వ వార్డు ఆదర్శవంతమైన వార్డుగా చెయ్యాలని, అందుకోసం ఎంత కష్టమైన పనులు ఉన్న భాద్య తతో నడిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు చిల్ల భాస్కర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శిల్లా వంశీ రెడ్డి, యువజన అధ్యక్షుడు కొండపు సూరిబాబు, నాయకులు పట్నాల రాము, సత్యనారాయణ స్వామి ఆలయ చైర్మన్ శరగడ నాగి రెడ్డి, చెట్ల త్రినాధ్ రెడ్డి ,టి అప్పలరాజు ,బోండా కిరణ్, చెట్ల నర్సి తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో దేవరాపల్లి విద్యార్థి ప్రతిభ



దేవరాపల్లి, (విజయభాను న్యూస్ ) : ఉమ్మడి జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో దేవరాపల్లి విద్యార్థి కక్కల దుర్గాప్రసాద్ ప్రతిభ సాధించారు. ఈ నెల 11న అనకాపల్లి జిల్లా అనకాపల్లి ఏఎంఏఎల్ కాలేజీలో పాఠశాల స్థాయి గేమ్స్ ఫెడరేషన్ అండర్ 19 బాలుర అథ్లెటిక్స్ క్రీడా పోటీలు జరిగాయి. ఈ క్రీడా పోటీల్లో దేవరాపల్లి ప్రభుత్వం పాఠశాలలో చదువుతున్న విద్యార్థి కక్కల దుర్గాప్రసాద్ ఉత్తమ ప్రతిభను కనబరిచారు. 200 మీటర్ల రన్నింగ్ లో ప్రథమ స్థానం, 400 మీటర్ల రన్నింగ్ లో ప్రథమ స్థానం, డిస్కు త్రో లో ప్రథమ స్థానం సాధించగా, షాట్ పుట్ లో ద్వితీయ స్థానం సాధించారని ఇంచార్జ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాండురంగారావు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని, పాఠశాలతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆయన ఆకాంక్షించారు. ప్రతిభ సాధించిన విద్యార్థి దుర్గాప్రసాద్ ని విద్యార్థికి తర్ఫీదునిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు టీ.నాగేశ్వరరావుని హెచ్ఎం పాండురంగారావు తో పాటు ఇతర ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

# ఘనంగా గౌరీ పరమేశ్వరుల ఆలయ 28వ వార్షికోత్సవం




గాజువాక (విజయభాను న్యూస్): పశ్చిమ నియోజకవర్గం పారిశ్రామిక ప్రాంతం 60వ వార్డు ఇందిరా కాలనీలో కొలువై ఉన్న శ్రీ శ్రీ గౌరీ పరమేశ్వరుల మహోత్సవాల తోపాటు ఆలయ 28వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు తో పాటు బోనాల పండుగను బుధవారం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు బిందెల నృత్యాలు కోలాటాలు ప్రదర్శించారు. ఈ కోలాటాలు స్థానిక ప్రజలను ఎంతో ఆకర్షిం చాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు వైకాపా నగర ప్రధాన కార్యదర్శి సరగడం పత్ని రావు మాట్లాడుతూ ఈ మహోత్సవాలు కార్తీక మాసాలలో నెల రోజుల పాటు అంగరంగ వైభవంగా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరుపుతున్నామని ప్రతిరోజు గౌరీ పరమేశ్వ రులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ నేటి వరకు దిగ్విజయంగా ఈ మహోత్సవాలను కొనసాగిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శులు సభ్యులు మహిళలు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రాష్ట్రంలో రాక్షస పాలనను అంతం చేసేందుకు తెలుగు శక్తి పోరాటం

- 18న ముఖాముఖి చర్చకు మంత్రి గుడివాడ అమర్నాథ్ సిద్ధమా! తెలుగు శక్తి సవాల్
- గుడివాడ అనుచరుల నుంచి ప్రాణహాని ఉంది బి.వి.రామ్ ఆందోళన
- గుడివాడ సోదరుడిని అంటూ ఒక వ్యక్తి ఫోన్ చేసి దుర్భాషలాడారు
- కలెక్టర్ మల్లికార్జున్ కు తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ ఫిర్యాదు



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : తనకు మంత్రి గుడివాడ అమర్నాథ్ అనుచరుల నుంచి ప్రాణహాని ఉందని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే విషయమై ఆయన జిల్లా కలెక్టర్ మల్లికార్జున కు మరియు పోలీస్ కమిషనర్ కు ఒక వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటి కప్పుడు ఎండగడుతున్న తనపై మంత్రి గుడివాడ అమర్నాథ్ అనుచరులు కక్ష కట్టారన్నారు. ఇదే క్రమంలో మంగళవారం మధ్యాహ్నం ఒక వ్యక్తి గుడివాడ అమర్ సోదరుడిని అంటూ ఫోన్ చేసి బెదిరించారన్నారు. మాటిమాటికి గుడివాడ అమర్ ని విమర్శిస్తే సహించేది లేదని.. మాటల్లో చెప్పలేని విధంగా, అక్షరాల్లో రాయ లేని విధంగా దుర్భాషలాడారన్నారు. ఇటువంటి బెదిరింపులకు తాను భయపడేది లేదని.. అయితే ముందు జాగ్రత్తగా మరింతమందికి బెదిరింపులు వెళ్లకుండా ఉండే ఉద్దేశంతోనే జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేశానన్నారు. ఈ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండ గొడుతూ మాట్లాడే ప్రాథమిక హక్కును రాజ్యాంగం ప్రసాదించిందన్నారు. గుడివాడ అమర్ అతని చెంచా గాళ్ల చేత బెదిరింపులకు పాల్పడడం లాంటి చవక బారు పనులను మానుకోవాలన్నారు. అతనికి నిజంగా వారి ప్రభుత్వ విధానాలపై చిత్తశుద్ధి ఉంటే తనతో నేరుగా బహిరంగ చర్చకు సిద్ధం కావాలన్నారు. ఈనెల 18వ తేదీన (శుక్రవారం) ఉదయం 10 గంటలకు వీజేఎఫ్ ప్రెస్ క్లబ్ లో తాను సిద్ధంగా ఉంటానని.. గుడివాడ అక్కడికి వచ్చి మాట్లాడాలన్నారు. ఈ రాష్ట్రంలో కొనసాగుతున్న రాక్షస పాలనను అంతం చేసేందుకు తెలుగు శక్తి నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటుందని బి.వి.రామ్ స్పష్టం చేశారు.

# గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

## - సబ్బవరం సిఐ పి.రంగనాదం




సబ్బవరం(విజయభాను న్యూస్) :: విజ్ఞాన సముదాయమైన గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సబ్బవరం సిఐ పి. రంగనాదం అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక సబ్బవరం శాఖ గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం గ్రంథాలయాధికారి.పి.వి.రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రంథాలయ ఉద్యమ నాయకులు సంస్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సబ్బవరం సిఐ పి.రంగనాదం పాల్గొని అయ్యంకి వెంకట రమణయ్య, గాడి చర్ల సర్వోత్తరావు చిత్ర పటాలుకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐ పి.రంగనాథరావు మాట్లాడుతూ

విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని, పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందుతుందని అన్నారు. అనంతరం పలు పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు జి డేవిడ్, సురేష్, బి.సింహాద్రి మాస్టర్ ,పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

# చోడవరం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ పత్రిక దినోత్సవం

## - సీఐ శ్రీనివాసరావు చేతుల మీదుగా పేదలకు అన్నదానం




**చోడవరం సీఐ, ఎస్ఐ చేతుల మీదుగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న చోడవరం ప్రెస్ క్లబ్ సభ్యులు**

చోడవరం(విజయభాను న్యూస్) : చోడవరం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ పత్రిక దినోత్సవ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. స్థానిక స్వయంభు విగ్నేశ్వర స్వామి ఆలయ ఆవరణలో చోడవరం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు దొడ్డి వెంకట ముత్యాల నాయుడు (డివిఎం నాయుడు) ఆధ్వ ర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చోడవరం సీఐ బి శ్రీనివాసరావు,ఎస్ఐ బి.అప్పల నాయుడు ముఖ్య అతిథులుగా పాల్గొని వారి చేతుల మీదుగా పేదలకు అన్నదానం నిర్వహించారు.

ఈ కార్య క్రమంలో సీనియర్ పాత్రికేయులు కోవెల శ్రీనివాసరావు, కొప్పాక భాస్కరరావు, ప్రగడ శ్రీనివాసరావు, దేవరపల్లి నవ కుమార్, దాడి సత్యనారాయణ, ద్వారపురెడ్డి శ్రీను, ఆలయ అర్చకులు కొడమంచిలి చలపతిరావు, వడ్డాది నరసింహ పంతులు, బురెడ్డి శ్రీనివాస్, పుల్లేటి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన భవనంలోకి విద్యాశాఖ , మత్సశాఖ కార్యాలయంలు

## ప్రారంభించిన ఎంపీపీ కోన సంధ్య బుజ్జి



అచ్యుతాపురం (విజయభాను న్యూస్) : నూతన భవనంలోకి మార్చిన మండల విద్యాశాఖ కార్యా లయం, మత్సశాఖ కార్యాలయంలను ఎంపీపీ కోన సంధ్య బుజ్జి బుధవారం ప్రారంభించారు.

ఇప్పటివరకు సేవలందించిన కార్యాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో ఎంఈఓ, మత్స్యశాఖ కార్యా లయంలను నూతన భవనంలోకి మార్చారు. ఈ కార్యక్రమంలో కో జడ్పిటిసి నర్మాల కుమార్ , వైసిపి మండల పార్టీ అధ్యక్షులు దేశంశెట్టి శంకరరావు, సర్పంచ్ కూండ్రపు విమలానాయుడు, పూడి వాసు, ఎంపిటీసీ లాలం శ్రీను , ఎంఈఓ సిఆర్ కె దేవరాయల్ , యటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి సబ్బారపు నూకరాజు , నాయకులు , ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు .

# విశాఖపట్నంలో 'పాత్ టు ప్రాఫిట్' నిర్వహిస్తున్న క్వాంటమ్ మ్యూచువల్ ఫండ్

**2022 నవంబర్ 18 మరియు 19 తేదీలలో రెండు ప్రధాన దక్షిణ భారత నగరాల్లో పెట్టుబడిదారుల సమావేశం మరియు శుభాకాంక్షలు**

విశాఖపట్నం : క్వాంటమ్ మ్యూచువల్ ఫండ్ ద్వారా పెట్టుబడిదారుల కోసం ప్రత్యేక ఆఫ్లైన్ సెషన్ 'పాత్ టు ప్రాఫిట్' నవంబర్ 18, 2022న నిర్వహించబడుతుంది. 'పాత్ టు ప్రాఫిట్' అనేది క్వాంటమ్ మ్యూచువల్ ఫండ్ ద్వారా ఇప్పటికే ఉన్న మరియు సంభావ్య పెట్టుబడిదారులను వ్యక్తిగత మరియు ఇంటరాక్టివ్ మార్గంలో చేరుకోవడానికి ఒక చొరవ. ఇక్కడ, ఫండ్ మేనేజర్లు & ఇన్వెస్ట్మెంట్ నిపుణులు పెట్టుబడి అపోహలను ఛేదించి, పెట్టుబడిదారులకు బాగా సమాచారం ఉన్న ఆర్థిక నిర్ణయాలు తీసుకోవడంలో సహాయపడతారు.

ఈసారి సెషన్లలో క్వాంటమ్ AMC ఫండ్ మేనేజర్ జార్జ్ థామస్ మరియు క్వాంటమ్ అడ్వైజర్స్ పోర్ట్ఫోలియో మేనేజర్ నీలేష్ శెట్టి ప్రసంగిస్తారు.

పెట్టుబడిదారుల సందేహాలను పరిష్కరించడంతో పాటు, ప్రస్తుత పరిస్థితుల్లో మూడు ముఖ్యమైన సమస్యలను సెషన్ పరిష్కరిస్తుంది.

ముఖ్యాంశాలు :

1. భారతీయ మార్కెట్ను నడిపించే కారకాలు మరియు ఇతర ఆర్థిక వ్యవస్థల కంటే మెరుగైన స్థానంలో ఉండేలా చేస్తుంది.
2. రాబోయే రెండు - మూడు సంవత్సరాలకు ఈక్విటీ ఔట్లుక్.
3. ఆస్తి కేటాయింపు, ప్రాముఖ్యత మరియు పెట్టుబడిదారులు పరిస్థితులకు అనుగుణంగా సరైన ఆస్తి కేటాయింపును ఎలా నిర్వహించగలరు.

విశాఖపట్నంలోని ఈ కార్యక్రమం నవంబర్ 18వ తేదీ సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు ఫార్చ్యూన్ ఇన్ శ్రీ కన్యాలో జరుగుతుంది. ఈ ప్రయాణంలో బెంగళూరు, మైసూర్, కోయంబత్తూర్, మధురై, సేలం, పాండిచ్చేరి మరియు చెన్నై ఉన్నాయి.

ఇక్కడ, పెట్టుబడిదారులు మిస్టర్ దయాల్ మరియు క్వాంటమ్ మ్యూచువల్ ఫండ్ ఫండ్ మేనేజర్లను కలుసుకుని ఆర్థికపరమైన ప్రశ్నలు అడగవచ్చు. మా ప్రయత్నించిన మరియు పరీక్షించబడిన పరిశోధన ఆధారిత ప్రక్రియ మా పెట్టుబడిదారులకు దీర్ఘకాలికంగా మార్కెట్ను అధిగమించే రిస్క్ సర్దుబాటు చేసిన రాబడిని పొందడానికి ఛానెల్ని అందిస్తుంది. క్వాంటం మ్యూచువల్ ఫండ్ యొక్క నిరంతర ఔచిత్యం మ్యూచువల్ ఫండ్ పెట్టుబడి రంగంలో ట్రయిల్బ్లేజర్గా దాని ఖ్యాతి యొక్క ఉత్పత్తి. ప్రగతిశీల పెట్టుబడి వ్యూహాల యొక్క ఘనమైన ట్రాక్ రికార్డ్ మరియు పెట్టుబడిదారుల శ్రేయస్సు పట్ల నిబద్ధతతో, మేము ఆలోచనాత్మకమైన పెట్టుబడిదారులకు ఎంపిక చేసుకునే ప్రధాన నిధిగా కొనసాగుతాము. మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులు మార్కెట్ నష్టాలకు లోబడి అన్ని స్కీమ్ సంబంధిత డాక్యుమెంట్లను జాగ్రత్తగా చదవండి.

# ముషిడిపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం



దేవరాపల్లి,(విజయభాను న్యూస్) : మండలంలోని ముసిడిపల్లి పంచాయతీ కొల్లివీధి, రావాడపాలెం గ్రామాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం డిప్యూటీ సీఎం పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు ప్రారంభించారు. ఆ గ్రామ సర్పంచ్ తో ఈ కార్యక్రమంలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ గ్రామంలో అవసరమైన వసతులను గుర్తించి అభివృద్ధి పనులకు అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు కర్రి సత్యం, పార్టీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, మండల స్థాయి అధికార బృందం, తదితర పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## జగనన్న క్రీడా సంబరాల పోస్టర్ విడుదల



దేవరాపల్లి, (విజయభాను న్యూస్) :డిసెంబర్ 21వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా స్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఎస్ఏఏపి) ఆధ్వర్యంలో జరుగనున్న ఆటల పోటీలు పోస్టర్ ను వైజాగ్ ఎంవిపి కార్యాలయంలో విడుదల చేసిన ఉపముఖ్యమంత్రి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు. ఈ కార్యక్రమంలో నాయకులు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# అవంతి కళాశాలలో ఏక్వయిటీ టీం ల అవగాహన సదస్సు



భీమునిపట్నం (విజయభానున్యూస్) : మెడికల్ డాక్యు మెంటేషన్ మరియు కోడింగ్ కోసం డిజిటల్ స్క్రైబ్లను అందిస్తున్న గ్లోబల్ లీడర్ అయిన ఆక్విటీ సొల్యూషన్స్ బుధవారం అవంతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్లో అవగాహన ఒప్పందంపై సంతకం చేసింది. డొమైన్లోని విద్యార్థులు మరియు సిబ్బందికి శిక్షణ ఇవ్వడం ఈ ఒప్పందం లక్ష్యం. ఆక్విటీ సొల్యూషన్స్ ప్రెసిడెంట్ మరియు సిఇఒ కశ్యప్ జోషి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి శర్మ అవంతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ తో అవగాహన ఒప్పందాన్ని మార్చుకున్నారు. డైరెక్టర్ డాక్టర్ ఎ చంద్ర శేఖర్, ప్లేస్మెంట్ డీన్ డాక్టర్ టి శ్రీనివాస్ సమక్షంలో అవంతి ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంబివి. రాజు మరియు వైస్ ప్రిన్సిపల్ . వి. ఉమా శంకర్ కంపెనీ ప్రొఫైల్ మరియు ప్రస్తుత దృష్టాంతం గురించి క్లుప్తంగా, కశ్యప్ జోషి మెడికల్ డాక్యుమెంటేషన్ మరియు డిజిటల్ స్క్రైబ్ హెల్త్కేర్ అభివృద్ధి చెందుతున్న రంగమని మరియు భారతీయ యువత అన్వేషించడానికి చాలా అవకాశాలు ఎదురుచూస్తున్నాయని పేర్కొన్నారు. విశాఖపట్నంలో కొత్త బ్రాంచ్ ను ప్రారంభిస్తున్నామని, మధ్య మరియు ఉత్తర భారతదేశంలో తమ కార్యకలాపాలను విస్తరించాలని యోచిస్తున్నట్లు ఆయన తెలియజేశారు. 2021-22 సంవత్సరానికి . సంస్థ చెరుకుపల్లి క్యాంపస్ నుండి 20 మంది ఫార్మసీ విద్యార్థులను రిక్రూట్ చేసుకున్నట్లు కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి శర్మ పేర్కొన్నారు. ఎంఓయూపై సంతకం చేసిన తర్వాత, కశ్యప్ జోషి డీన్తో సంభాషించారు ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.ఎస్.శర్మ, వైస్ ప్రెసిడెంట్ వి.సురేష్, ఫైనాన్స్%డ% అకౌంటెంట్ జనరల్ మేనేజర్ వైభవ్ జోషి,అవిజిత్ ఆంత్రపులిక్కల్, కెల్విన్ సైమన్ తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ ట్రావెల్ అండ్ టూరిజం ఫౌండేషన్ సేవ దివ్యాంగుల పిల్లలకు విశాఖ జూ లో పిక్నిక్



విశాఖపట్నం (విజయభాను న్యూస్) నగరానికి చెందిన ప్రముఖ స్వచ్ఛంద సంస్థ విశాఖ ట్రావెల్ అండ్ టూరిజం ఫౌండేషన్ ప్రముఖ దర్శకుడు జాతీయ అవార్డు గ్రహీత మణి భూషణ్ చిల్డ్రన్ టూరిజం లో భాగంగా ప్రజ్వల వాణి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యం లో నిర్వహిస్తున్నదివ్యాంగుల పిల్లల కు ఉచితంగా జూలో వనభోజనం వేడుకలు జరిపారు ఈ సందర్భంగా దర్శకుడు మణి భూషణ్ మాట్లాడుతూ దివ్యాంగుల పిల్లలుకు విజ్ఞానం అందించేలా జూ లో ఉన్న జంతువులను చూసి వారు ఆనందపడేలా విహార యాత్రను రూపొందించి, ఈ రోజు సుమారు 60 మంది పిల్లలకు వి టి టి ఎఫ్ ద్వార ఈ సేవ తొలి ట్రావెల్ ఈవెంట్ ను విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీ సురేష్ , శ్రీ మాధవశర్మ , రమణ మరియు జూ ఆఫీసర్స్ వారి సహకారం తో పిల్లలందరికీ ఉచిత ట్రాన్స్పోర్ట్, భోజనం , జూ ప్రవేశం , నడవలేని పిల్లలకు బ్యాటరీ కార్ లో ప్రయాణం ఏర్పాటుచేసి పిల్లల మనస్సులో ఒక కొత్త అనుభూతిని పొందేలా ఈ ట్రావెల్ ప్రోగ్రాం అటు పిల్లల తల్లిదండ్రులకు సంతోషాన్ని కలిగించే విధంగా డిజైన్ చేసిన హీరో మరియు వైస్ ప్రెసిడెంట్ ఆదిత్యభూషణ్ , ట్రెజరర్ మరియు ఫిలిం ఎడిటర్ నీరజభూషణ్ మరియు పిల్లల్ని కంటికి రెప్పలా కాపాడుతూ గైడెన్స్ ఇచ్చిన సుచిత్ర ఫౌండర్ ప్రజ్వలవాణి వెల్ఫేర్ సొసైటీ వారికీ ధన్యవాదాలు తెలిపారు . త్వరలో "చిల్డ్రన్ టూరిజం " ద్వార చిన్నపిల్లకు క్లబ్ ఓపెన్ చేసి ఉచిత విహార యాత్రలను , విజ్ఞాన సెమినార్ లు నిర్వహించి పిల్లలకు పర్యాటకం పట్ల అవగహన కలిపించే దిశగా ప్రణాళికలు విశాఖ ట్రావెల్ అండ్ టూరిజం ఫౌండేషన్ నిరంతరం చేస్తుందని, మరిన్ని వివరాలకు చిల్డ్రన్ టూరిజం క్లబ్ లో జాయిన్ అవడానికి 9848418582 సంప్రదించండి. ఈ కార్యక్రమం లో టీవీ టూరిజం సీఈఓ సీతారామ స్వామి, జూ ఆఫీసర్స్ పాల్గొన్నారు మరియు దివ్యంగుల పిల్లలు కేరింతల మధ్య ఉత్సాహంగా జూ పార్క్ అంతా సందర్శించారు.

# డౌనూరులో జలజీవన్ మిషన్పై కార్యక్రమం



కొయ్యూరు (విజయభాను న్యూస్) : కొయ్యూరు మండలం డౌనూరు గ్రామంలో బుధవారం జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి కుళాయల నూతన ప్రారంభోత్సవ సంబంధించి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పొట్టిక భవానీ, మాజీ సర్పంచ్లు వెంకటలక్ష్మీ, ఉల్లి నరసమ్మ, వైసిపి నాయకులు పొట్టిక పోతురాజు, నీలాపు సూరిబాబు, సురేష్ పట్నాయక్, లక్ష్మణరావు, రాజబాబు, జగన్, గ్రామ ప్రజలు మహిళలు, అధికారులు పాల్గొన్నారు.

# ఐటీడీఏ పెట్రోల్ బంకు నిర్వహణకు దరఖాస్తులు ఆహ్వానం..

అల్లూరిజిల్లా. విజయభాను.పాడేరు :సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐ.టి.డి.ఎ), పాడేరు వారి ద్వారా అరకు మండలం (పానిరంగిణి), ముంచింగిపుట్టు మండలం (లుంగపుట్టు), అనంతగిరి మండలం (అనంతగిరి) గ్రామాలలో నెలకొల్పుతున్న హెచ్ పి పెట్రోలు పంపుల నిర్వహణ కొరకు, 21 సంవత్సరములు నిండిన స్థానిక గిరిజన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు నుండి సర్వీస్ ప్రొవైడర్ గా ధరఖాస్తుల చేసికోనవలసినిదిగా ప్రాజెక్ట్ అధికారి, ఐ.టి.డి.ఎ, పాడేరు వారు కోరడమైనది. సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐ.టి.డి.ఎ), పాడేరు పరిధిలో గల స్థానిక గిరిజనులు అయివుండి, కనీస విద్యార్హత పదవ తరగతి ఉత్తీర్ణత పొంది, ఎద్దైన వ్యాపార రంగములో అనుభవము కలిగిన ఔత్సాహిక యువతీ, యువకులు ధరఖాస్తు చేసుకోవచ్చున్ని అన్నారు.పంపు నిర్వహణకు ఎంపిక కాబడిన అభ్యర్థికి రెండు సంవత్సరాల కాలం వ్యవధి నిర్వహణ వరకు సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ (ఐ.టి.డి.ఎ), పాడేరు మరియు ఎంపిక కాబడిన అభ్యర్థికి మధ్య ఒప్పందం ఉంటుందని తెలిపారు.ఎంపిక కాబడిన అభ్యర్థులు పూర్తిగా నిర్వహణ పెట్టుబడి పెట్టుకోగల ఆర్థిక స్థోమత వుండవలసి ఉంటుందని తెలిపారు . ముందుగా సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ (ఐ.టి.డి.ఎ), పాడేరు వారికి కనీసం రూ " 20.00 లక్షలు బ్యాంక్ గ్యారెంటీ ఇవ్వలని అన్నారు. ఎంపిక కాబడిన అభ్యర్థులు పంపు నిర్వహణ మరియు కావాల్సిన సిబ్బందిని నియమించుకోవల్సి వుంటుందని తెలిపారు . (స్థానిక గిరిజన యువతీ యువకులను మాత్రమే) సిబ్బంది జీతభత్యాలు ఐ.టి.డి.ఎ తిరిగి చెల్లించడం జరుగుతుందని అన్నారు. ఎంపిక కాబడిన అభ్యర్థికి (సర్వీస్ ప్రొవైడర్) నెలవారి రూ "30,000 వేలు జీతం చెల్లించడం జరుగుతుందని అన్నారు. జరిగిన వ్యాపారంను బట్టి ఇన్సెంటివ్ (షరతులతో కూడిన) వుంటుందని తెలిపారు. ఒక్క అభ్యర్థికి ఒక్క పెట్రోలు పంపు మాత్రమే కేటాయించడం జరుగుతుందని అన్నారు.పైన తెలిపిన అర్హతలు కలిగి మరియు ఆర్థిక ఒప్పందములకు అంగీకరించిన అభ్యర్థులు ధరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు . ధరఖాస్తులు తేది:ఈ నెల 18. నుండి ప్రాజెక్ట్ అధికారి,ఐ.టి.డి.ఎ, పాడేరు వారి కార్యలమునందు లబించునని అన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులు తే"ది: 22.సాయంత్రం 5.00 గంటల లోపులో ప్రాజెక్ట్ అధికారి, ఐ.టి.డి.ఎ, పాడేరు వారి కార్యలములో అందచేయవలెనని అన్నారు .

గమనిక : నియమ నిబంధనలు తో కూడిన ధరఖాస్తులు సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ (ఐ.టి.డి.ఎ), పాడేరు వారి కార్యలమునందు తిరిగి చెల్లించని రుసుము రూ" 1,000 లు చెల్లించి దరఖాస్తులు పొందగలరు. అన్ని నిబంధనలకు అంగీకరించు వారు మాత్రమే ధరఖాస్తు చేసికొనవలెనని తెలిపారు .

# దేవరాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ క్లీనింగ్

దేవరాపల్లి,(విజయభాను న్యూస్) :దేవరాపల్లి మండల కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంగణమంతా పంచాయతీ శానిటేషన్ సిబ్బంది, కాంప్లెక్స్ ప్రాంగణమంతా పిచ్చి తుప్పలు నిండి ఉన్న ఆ ప్రాంతాన్ని పూర్తిగా శుభ్రపరిచి బ్లేడ్ డాక్టర్ సహాయంతో ఎత్తుపల్లాలను లెవెల్ చేశారు. దీంతో ఆర్టీసీ కాంప్లెక్స్ కి వచ్చి పోయి ప్రయాణికులంతా ఆనందం వ్యక్తం చేశారు. ఎప్పటినుంచో పిచ్చి తుప్పులతో పేరుకుపోయి దుర్గంధం వెదజల్లే కాంప్లెక్స్ ఆ సిబ్బంది పనితీరుతో మంగళవారం ఆ ప్రదేశం అంతా సర్వాంగ సుందరంగా కనిపించింది. దీంతో ప్రయాణికులు చుట్టుపక్కల వాళ్ళు కాంప్లెక్స్ కు మంచి రోజులు వచ్చాయంటూ, అందరూ ఆ శానిటేషన్ సిబ్బందికి అభినందనలు తెలియజేశారు.

## జీ తెలుగు లో 20న బిగ్గెస్ట్ బ్లాక్బస్టర్ కార్తికేయ- 2

విశాఖపట్నం : నాన్స్టాప్ ఎంటర్టైన్మెంట్కు కేరాఫ్ అడ్రస్ గా నిలుస్తున్న జీ తెలుగు ఛానల్ సరికొత్ సినిమాలు, ఆకట్టుకునే సీరియల్స్తో ప్రతీవారం వస్తుందని ఆ ఛానల్ ప్రతినిధి అన్నారు. ఇప్పటికే ఎన్నో సూపర్హిట్ సినిమాల్ని అందించిన జీ తెలుగు ఈ ఏడాదిలో బిగ్గెస్ట్ బ్లాక్బస్టర్గా నిలిచిన కార్తికేయ 2ని ఈ నెల 20న ప్రసారం చేయనుందన్నారు.

మైథలాజికల్ యాక్షన్ అడ్వంచర్ మూవీగా రూపొందిన కార్తికేయ- 2 ఈ ఆదివారం సాయంత్రం 6 గం.లకు జీ తెలుగులో ప్రసారం కానుందన్నారు. ఈ సినిమా ప్రమోషన్స్ లో ఖమ్మం లోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్ లోదాదాపు 2000 లకు పైగా స్టూడెంట్స్ తో మానవహారంగా ఏర్పడి అతిపెద్ద శ్రీ కృష్ణుడి బొమ్మను సృష్టించారన్నారు. ఇందులో హీరోగా నిఖిల్ సిద్ధార్థ్, హీరోయిన్గా అనుపమ పరమేశ్వరన్ నటించారని, ఇతర పాత్రల్లో అనుపమ్ ఖేర్, శ్రీనివాసరెడ్డి, హర్ష, ఆదిత్య మీనన్ నటించారన్నారు.

# కస్తూరిబా బాలికల పాఠశాల మెనూపై తాసిల్దార్ అసంతృప్తి





అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ (విజయభాను న్యూస్) : మండలం లోని పద్మాపురం పంచాయితీ పరిధిలో గల యండపల్లి వలస. కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో తహసిల్దార్ ఏ. వేణుగోపాల్.బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ కస్తూర్బా పాఠశాలలో మెనూ సక్రమంగా నిర్వహించడం లేదని పాఠశాల ప్రిన్సిపాల్ వంట నిర్వాహకులపై అసంతృప్తిని వ్యక్తం చేశారు ఇది ఇలా ఉండగా ప్రభుత్వం సరఫరా చేస్తున్న సరుకులు సక్రమంగా లేవని అలాగే భద్రపరిచే గది కూడా శుభ్రంగా లేకపోవడాన్ని కాయగూరలు వాడిపోయి ఉండటంతో తాసిల్దార్ సిబ్బందిని నిలదీశారు ఇకపై విద్యార్థినులకు సక్రమంగా మెనూ అమలు చెయ్యకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు అనంతరం ఎండపల్లి వలస ప్రభుత్వ ఆశ్రమ బాలికల నిర్వహించి మెనూ అమలుపై సంతృప్తి వ్యక్తం చేశారు విద్యార్థినులతో కలిసి విద్యార్థినులకు ఆరోగ్యం విద్యపై అవగహనా పరిచారు ఈ తనిఖీల్లో అరకులోయ మండల అభివృద్ధి అధికారి వెంకటేష్ తో కలిసి ఎండపల్లి వలస అంగనవాడి కేంద్రాన్ని సందర్శించి గర్భిణులకు బాలింతలకు ఏడు నెలల నుండి మూడు సంవత్సరాల పిల్లలకు సక్రమంగా పౌష్టికాహారం పై పలు సూచనలు చేశారు అంగన్వాడి కేంద్రంలో పిల్లలకు సరఫరా చేసే ఆహారం వంటకాలను తనిఖీ చేస్తూ సంతృప్తిని వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో....

సచివాలయ సిబ్బంది ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తమ తమ కళాశాలలో నిర్వహించిన తనిఖీల్లో ఉన్నారు.

# గుర్తు తెలియని మృతదేహం లభ్యం



అల్లూరిజిల్లా. విజయభాను.పాడేరు: మండల కేంద్రంలో గల స్థానిక సినిమా హాల్ సెంటర్ సమీపంలోనే సినిమా హాల్ ప్రహరీ గోడ వద్ద గుర్తుతెలియని మృతదేహం లభ్యమయ్యింది. స్థానికులు గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించి పాడేరు పోలీసులకు సమాచారం అందించారు.ఘటన స్థలంలో పాడేరు, సీఐ సుధాకర్, ఎస్ ఐ లు లక్ష్మణ్, రంజిత్ హుటాహుటిన చేరుకున్నారు.మృతదేహాన్నిపరిశీంచారు.స్థానికులు,ఆర్ ఐ ఓ భాస్కర్ రావు,వీఆర్వో రామాజోగారావు అందించిన సమాచారం మేరకు కేసును నమోదు చేశారు.మృతదేహానికి పంచనామా నిర్వహించేందుకు జిల్లా ఆసుపత్రికి తరలించారు.



# గ్రంథాలయాల వల్ల సామాజిక అభివృద్ధి సాధ్యపడుతుంది



గాజువాక (విజయభాను న్యూస్ ): గ్రంథాలయాల వల్ల సమాచారం తెలుస్తుందని, ఆ సమాచారం చైతన్యానికి, మార్పుకు, అభివృద్ధికి దారి తీస్తుందని సెయింట్ ఆన్స్ కళాశాల జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయాదేవి అన్నారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ కళాశాలలో జరుగుతున్న గ్రంథాలయ వారోత్సవాల్లో బుధవారం వ్యాసరచన వక్తృత్వ పోటీలను ఆమె ప్రారంభిస్తూ - గ్రంథాలయాల వల్లే సంఘసంస్కరణ జరుగుతుందని అన్నారు. గురజాడ అప్పారావు, కందుకూరి వీరేశలింగం మొదలగువారు తమ రచనలతో సమాజ అభివృద్ధికి, సంఘ సంస్కరణకు పాటుపడ్డారని అన్నారు. అనంతరం గ్రంథాలయ అధికారి జి.శిరీష గ్రంథాలయాల ఉపయోగాలపై వ్యాసరచన పోటీని, గ్రంథాలయ ఉద్యమంపై వక్తృత్వ పోటీని నిర్వహించారు.ఈ పోటీలలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు వీటికి న్యాయ నిర్ణేతలుగా అధ్యాపకులు లక్ష్మీదేవి,వై. అనసూయదేవి, త్రివేణి వ్యవహరించారు.

# 87వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



గాజువాక (విజయభాను న్యూస్ ): జీవీఎంసీ 87వ పరిధిలో గల గడపగడప మన ప్రభుత్వం లో భాగంగా వడ్లపూడి సచివాలయం 1, ఎరుకలవిది సచివాలయం పరిధిలో సుమారుగా రూ.40 లక్షల వ్యయామంతో అభివృద్ధి పనులుగాను శంకుస్థాపన చేశారు. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఒక్కొక్క సచివాలయానికి సుమారు 20లక్షలు ప్రభుత్వ నిధులను వెచ్చించి అభివృద్ధి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గడపకు గడపకు కార్యక్రమంలో వచ్చిన సమస్య లను పరిష్కరించేటట్లు కలెక్టర్ సమక్షంలో పనులు పూర్తియ్యేటచూస్తారని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజలందరికీ పూర్తిగా వినియోగపడేటట్లు చేసినందుకు ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. లక్ష్మీపురం ఎలిమెంటరీ స్కూల్ ప్రహరి గోడ నిర్మాణానికి 13.41 లక్షలు

లక్ష్మీపురం కాలనీలో డ్రైన్స్ కల్వర్టులు నిర్మాణానికి 6.56 లక్షలు

కనితి గౌరవిది అప్పి కొండ కాలనీ డ్రైన్స్, కల్వర్టులు నిర్మాణానికి 6.95 లక్షలు, కణితి అంబేద్కర్ కాలనీలో డ్రమ్స్ కల్వర్ట్స్ నిర్మాణానికి 4.34 లక్షలు వెచ్చిస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో 87 వ వార్డు వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు వార్డ్ ఇంచార్జ్ కోమటి శ్రీనివాస్, ప్రగడవేణుబాబు, ముద్దపు దామోదర్, బోడ్డ గోవిందా, దుగ్గపు దానప్పలు, బోండా గోవిందరాజులు, వడ్లపూడి ఈశ్వరరావు, సిరపు పాపారావు, బి తిలక రాజు, హరీష్ వర్మ, ఆడారి శ్రీను,జెర్రిపోతుల ఈశ్వరరావు, కోమటి రమాదేవి,ఎస్ పార్వతి,కాంట్రేగుల కనక,జే విజయ్ కుమార్,సీతారామరాజు, ఈఈ ప్రసాద్బాబు, ఏఈ తులసి, జివిఎంసి సిబ్బంది సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కపాలభాతితో కాంతివంతమైన ఆరోగ్యం

**కపాలభాతి ప్రాణాయామం ఆడవారికి అనేక సమస్యల నుండి బయట పడటానికి చాలా సహాయపడుతుంది. ఒక నిర్దిష్ట సమయంలో అనేక భంగిమలను సాధన చేయవచ్చు. కపాలభాతి అనే పదం సంస్కృతం నుండి వచ్చింది. కపాల అంటే మస్తిష్కం అని,భాతి అంటే కాంతి లేదా మెరుపు అని అర్థం. ఈ భంగిమను అనుసరించటం ద్వారా చర్మంలో మెరుపు మరియు తాజాదనాన్ని గమనించవచ్చు.ఈ మార్పు అనేది ఒక్క రాత్రిలో రాదు. దీనిని సాధించటానికి చాలా కష్టపడాలి. యోగా వ్యాయామాలు శ్వాస నియంత్రణ మరియు సంతులనం నిర్వహణలో సహాయపడి శరీర అభివృద్ధిలో ముఖ్యమె%న పాత్రను పోషిస్తాయి. ప్రాణాయామం శ్వాసతో సంబంధం కలిగి ఆరోగ్యకరమైన శరీరం, మనస్సు, ఆత్మలను అందిస్తుంది. ఈ శక్తివంతమైన భంగిమ ప్రాథమికంగా చైతన్యాన్ని నింపటంలో సహాయపడి, వ్యవస్థకు ఒక టానిక్ వలే పనిచేస్తుంది. అందువల్ల ఈ ప్రాణాయామం వల్ల కపాలం శ్వాసలో మెరుస్తూ మంచి శ్వాస తీసుకుంటుంది. నిర్దిష్ట సమయంలో కపాలభాతి వ్యాయామాన్ని సాధన చేయటం ద్వారా కాపాలానికి మంచి శ్వాసను అందించవచ్చు.**



కపాలభాతి టెక్నిక్ నిర్వహించటానికి దశలు:

1. ఈ భంగిమను ప్రారంభించటానికి మీరు ఒక సౌకర్యవంతమైన స్థానంలో కూర్చోవాలి. అలాగే వెన్నెముకను నిటారుగా ఉంచి,ఉదరాన్ని సాధ్యమైనంత వరకు సౌకర్యవంతంగా ఉంచాలి.
2. మోకాళ్ళపై చేతులను ఉంచాలి. మోకాళ్ళ మీద అరచేతులను ఉంచాలి.
3. పొట్ట కింద బాగంలో దృష్టి పెట్టాలి. మంచి పరిపూర్ణత సాధించడానికి అరచేతులను మోకాళ్ళ మీద నుంచి పొట్ట కింద బాగంలో పెట్టి, ధ్యానం చేయాలి.
4. ఇప్పుడు ముక్కు రెండు రంధ్రాల ద్వారా లోతె%న శ్వాసను తీసుకోవాలి.
5. ఇప్పుడు అరచేతులతో పొట్టను శాంతంగా నొక్కి శ్వాసను నియంత్రించాలి.
6. గాలిని పీల్చటం ఆటోమేటిక్‌గా జరిగిపోతుంది. అందువల్ల గాలిని వదిలే క్రమం మీద దృష్టిని కేంద్రీకరించాలి.

7. మొదట 60 నుంచి 70 శ్వాసలతో ప్రారంభించాలి. ఆ తర్వాత 95 నుంచి 105 వరకు నిదానంగా పెంచుకుతూ వెళ్ళాలి. ఊపిరి అడ నట్టు అన్పిస్తే, ఆపి సాధారణ శ్వాస తీసుకోని మరల ప్రారంభించ వచ్చు.
8. ఈ ఆసనం వేసేటప్పుడు నోరు,ముక్కు రెండు అవయవాలు పనిచే స్తాయి. ముక్కు గాలి పీల్చుకోవటానికి మరియు నోరు గాలిని వదల టానికి సహాయపడుతుంది. ప్రతి రోజు 15 నుంచి 20 నిమిషాల పాటు చేస్తే మంచి పలితం కనపడుతుంది.

ఈ ఆసనం వలన కలిగే ఇతర ప్రయోజనాలు: సైనస్ ,ఊపిరితిత్తులు మరియు శ్వాస వ్యవస్థను శుభ్రం చేయడానికి సహాయపడుతుంది. అలెర్జీలకు వ్యతిరేకంగా పోరాడటానికి అవసరమె%న శక్తిని ఇస్తుంది. ఉదర కండరాలు మరియు డయాఫ్రాగమ్ కు శక్తినిస్తుంది.


ఏకాగ్రతను మెరుగుపరుస్తుంది. పునరుత్పత్తి వ్యవస్థ పనితీరును క్రమపరుస్తుంది. జాగ్రత్తలు గుండె సమస్యలు,ఉబ్బసం, అధిక రక్తపోటు, హెర్నియా ఉన్నవారు మరియు గర్భిణీ స్త్రీలు ఈ ఆసనానికి దూరంగా ఉండటం మంచిది. ఈ భం గిమ ఆరోగ్యకరమైన జన నేంద్రియ వ్యవస్థకు అద్భు తంగా పనిచేస్తుంది. పున రుత్పత్తి కోసం శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. ఈ భంగిమలను పుస్త కాల్లో చదివి లేదా ఫోటోలను చూసి చేయకూడదు. గురువు దగ్గర నేర్చుకొని మాత్రమే చేయాలి.

# ఆహారంతో ఆరోగ్యం



ఆహారంలో ప్రొటీన్లు తక్కువగా ఉంటే ఆకలి ఎక్కువగా అవుతుంది. 20 శాతం ప్రొటీన్లు ఉన్న భోజనం చేసే వారితో పోలిస్తే 15 శాతం ప్రొటీన్లు ఉన్న భోజనం తీసుకునే వారు ఒక రోజులో 260 క్యాలరీలు ఎక్కువగా తీసుకుంటారు. 70 శాతం అదనపు క్యాలరీలు మనం రోజూ తినే చిరు తిండ్లతోనే సమకూరుతుంది. సంవత్సరం గడిచే సరికి సుమారు ఐదు నుంచి ఎనిమిది కిలోల బరువు కూడా పెరుగుతాము. దీన్ని నివారించాలంటే మాంసం, చేపలు, కోడిగుడ్ల వంటి ఆహారాన్ని సాధారణంగా తీసుకునే దాని కన్నా ఎక్కువగా తీసుకోవాలి. మనం తీసుకునే ఆహారంలో ప్రొటీన్ల నిష్పత్తి తగ్గితే ఆకలి పెరుగుతుంది. తద్వారా ఇంకా తింటాం. దీంతో శరీరంలో కెలరీలు విపరీతంగా పెరిగిపోయాయి. ఆహారాన్ని స్వీకరించడంలో సమతుల్యత, వైవిధ్యం, మితంగా వ్యవహరించడం అనేవి ఆరోగ్యకరమైన అలవాటు. అలా అని ఒకేసారి తినేదాని కంటే అధికంగా పట్టించినా ఇబ్బందే. ఒక్కసారే ఎక్కువ మొత్తంలో తినేకంటే రోజులో ఎక్కువసార్లు కొద్దికొద్దిగా తినడమే ఆరోగ్యకరమని వైద్యులు చెబుతున్నారు. ఎక్కువ క్యాలరీలు పొందకుండా, ఒకే దానిని అతిగా స్వీకరించకుండా అనేక రకాలు ఆహార పదార్థాలను కొంచెంగా తీసుకోవడం మంచిది. పోషక పదార్థాలు అధికంగా ఉండే వివిధ రకాల ఆహార పదార్థాలను తీసుకోండి. ఈ లెక్కన మంచి ఆరోగ్యం కోసం వైవిధ్యమైన 30 నుంచి 35 రకాల పోషక పదార్థాలను తీసుకోవాల్సి ఉంటుంది. ఏ ఒక్క ఆహారం కూడా అన్నింటినీ అందించదు. మీ దినసరి ఆహార ఎంపికలో పప్పు ధాన్యాలతో చేసిన పదార్థాలు, పండ్లు, కూరగాయలు, పాల పదార్థాలు, మాంసం, చేపలు ఉండేలా చూసుకోవాలి. దీని కోసం టైం టేబుల్‌ను తయారు చేసుకుని దాన్ని పాటించాలి. రోజు ఎన్ని కెలరీలను ఖర్చు చేయగలమో అంత మోతాదులోనే ఆహారం తీసుకోవాలి. ధాన్యాలు, పండ్లు, పప్పులు, కూరగాయలను అధికంగా తీసుకోండి. పచ్చి కూరగాయలు తీసుకుంటే పోషకాలు నేరుగా అందుతాయి. అన్నంలో, చపాతీల్లో కూర ఎక్కువ తినాలి. రోజు ఎంత తినాలి? అనే విషయంలో మన చేసే పని, ఎత్తు, ప్రస్తుత బరువు, వయస్సు, స్త్రీ, పురుషుడు ఇలా పలు లక్షణాలను అంచనా వేయాల్సి ఉంటుంది. అధిక బరువు శరీరానికి చేటు చేస్తుంది. ఎత్తుకు సరిపోయేలా బరువు వుంటే చాలు. ఈ విషయంలో వైద్యుడిని సంప్రదించి సలహా తీసుకోండి. మితాహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చు.

# పిల్లలపై న్యుమోనియా నీడలు



పిల్లలపై న్యుమోనియా నీడలు కమ్ముకుంటున్నాయి. కరోనాకు చలి ప్రభావం తోడవ్వడంతో ఈ వ్యాధి చిన్నారులను గడగడలాడిస్తున్నది. ముఖ్యంగా ఈసారి చలితీవ్రత అధికంగా ఉండటంతో పిల్లల్లో ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులు పెరుగుతున్నట్లు నిలోఫర్ చిన్నపిల్లల విభాగాధిపతి ప్రొఫెసర్ ఉషారాణి తెలిపారు. చలి పులి పంజా విసురుతున్నది. చిన్న పిల్లలను న్యుమోనియా వెంటాడుతున్నది. కరోనాకు చలి ప్రభావం తోడవ్వడంతో న్యుమోనియా కోరలు సాచుతున్నది. ఇప్పటికే నగరంలో 30శాతం మంది చిన్నారులను ఈ వ్యాధి వెంటాడుతున్నది. ప్రతిరోజు నిలోఫర్ దవాఖానకు దాదాపు 80మంది చిన్నారులు న్యుమోనియాతో బాధపడుతూ చికిత్స నిమిత్తం వస్తున్నారు. కేవలం నిలోఫర్ లోనే ఇలా ఉంటే నగర వ్యాప్తంగా ఉన్న దవాఖానల్లో కేసులు పెద్ద సంఖ్యలో నమోదవుతున్నాయి. అయితే తల్లిదండ్రులు వ్యాధి తీవ్రత ముదరక ముందే వైద్యులను సంప్రదించాలని, నిర్లక్ష్యం చేస్తే పిల్లల ప్రాణాలకే ప్రమాదమని హెచ్చరిస్తున్నారు. తల్లిపాలతో న్యుమోనియాను అడ్డుకోవచ్చని సూచిస్తునా

పిల్లలకు సంబంధించిన వ్యాధుల్లో అత్యంత ప్రమాదకరమైనది న్యుమోనియానే అని, దీనివల్లనే 5 ఏండ్లలోపు పిల్లల్లో మరణాల రేటు అధికంగా ఉంటుందన్నారు. ఈ వ్యాధి వల్ల ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏడాది 2.5 మిలియన్ల మంది పిల్లలు మృత్యువాత పడుతున్నారని డబ్ల్యూహెచ్ఓ గణాంకాల ద్వారా తెలుస్తున్నది. గ్రేటర్‌లో 30శాతం మంది పిల్లలు ఈ న్యుమోనియా వ్యాధితో బాధపడుతున్నట్లు ఐఏపీ(ఇండియన్ అకాడమి ఆఫ్ పీడియాట్రిక్)వర్గాలు చెబుతున్నాయి. నగరంలోని నిలోఫర్ దవాఖానకు ప్రతిరోజు ఓపీ కోసం సుమారు 500మంది రోగులు వస్తే వారిలో 50నుంచి 80కేసులు న్యుమోనియాకు సంబంధించి ఉంటున్నట్లు నిలోఫర్ ఓపీడీ ఇన్‌చార్జి, ఆర్ఎంఓ డాక్టర్ రమేశ్ దాంపురి తెలిపారు. వీరిలో రోజుకు సుమారు 10నుంచి 12మందిని ఇన్‌పేషెంట్లుగా చేర్చుకుని చికిత్స అందిస్తుండగా, మిగిలిన వారికి ఓపీలో చికిత్స అందించడం జరుగుతుందన్నారు.

ఇది కేవలం నిలోఫర్ దవాఖానకు సంబంధించిన లెక్కలు మాత్రమేనని తెలిపారు. ఇక చిన్నపిల్లలకు సంబంధించిన క్లీనిక్‌లు, దవాఖానల్లో ఈ కేసులు అధికంగా ఉన్నట్లు తెలుస్తున్నది. అమెరికా వంటి దేశాల్లో ఇన్‌ఫ్లుయంజా, రెస్పిరేటరీ సిన్సిటియల్ వైరస్ (ఆర్‌సీవీ)వంటి వైరస్‌లతో న్యుమోనియా సంక్రమిస్తే మన దేశంలో ట్యూబర్‌కిలోసిస్ అనే బ్యాక్టీరియా ద్వారా ఎక్కువ సంక్రమిస్తుందని వైద్యులు తెలిపారు. పిల్లల్లో న్యుమోనియా వ్యాధిని సకాలంలో గుర్తించకపోవడంతో వ్యాధి తీవ్రత పెరిగి ప్రమాదస్థాయికి చేరుకుంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వ్యాధిపై ప్రజల్లో అవగాహణ లేకపోవడంతో రోగుల సంఖ్య, మరణాల సంఖ్య అధికంగా ఉంటుందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని 2009 నుంచి ప్రతి ఏటా నవంబర్ 12న ప్రపంచ న్యుమోనియా దినంగా పరిగణిస్తున్నారు.

**ఎలా సోకుతుంది?**

బ్యాక్టీరియా, ఫంగస్, వైరస్‌లతో పాటు ఇన్‌ఫ్లూయెంజా, రెస్పిరేటరీ సిన్సిటియల్ వైరస్ (ఆర్‌సీవీ)ల వల్ల న్యుమోనియా వ్యాధి సోకుతుంది. స్ట్రెప్టోకోకస్ బ్యాక్టీరియాతో కూడా ఈ వ్యాధి సంక్రమిస్తుంది. న్యుమోనియాలో రెండు రకాలు ఉన్నాయి.

1. బ్యాక్టీరియాతో వచ్చే న్యుమోనియా 2. వైరల్ ఇన్ఫెక్షన్స్. అంటే సమాజంలో కలిగే మార్పుల వల్ల వచ్చే న్యుమోనియా. దీన్ని కమ్యూనిటీ అక్వైర్డ్ న్యుమోనియా అంటారు. వాతావరణంలో కలిగే మార్పులు, ఇన్ఫెక్షన్‌ల వల్ల వస్తుంది. దవాఖానల్లోని ఇన్ఫెక్షన్‌ల వల్ల వచ్చే న్యుమోనియాను హెల్త్‌కేర్ అసోసియేటెడ్ న్యుమోనియా అంటారు. ఇది దవాఖానల్లో చేరినప్పుడు అక్కడి ఇన్ఫెక్షన్‌లు లేదా ఇన్‌ఫ్లుయంజాతో బాధపడే వారి నుంచి సోకుతుంది. ముఖ్యంగా 5సంవత్సరాల లోపు పిల్లలకు, హెచ్ఐవీతో బాధపడే పిల్లలకు ఈ వ్యాధి సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని నిలోఫర్ వైద్యులు తెలిపారు.

**వ్యాధి లక్షణాలు** నిమిషానికి 30సార్లకంటే ఎక్కువసార్లు శ్వాస తీసుకోవడం

పొత్తికడుపు, ఛాతిలో నొప్పి
నోటి చుట్టూ చర్మం
నీలిరంగుకు మారడం
పక్కలు ఎగేయడం%అ% ఆయాసం
తీవ్రమైన జ్వరం
ఊపిరి పీల్చుకోవడంలో అస్వస్థత
దగ్గు

న్యుమోనియాను అడ్డుకునే వ్యాక్సిన్‌లు ఇవే

బీసీజీ
పెంటావ్యాక్
హిబ్
న్యుమోకోకల్
మిజిల్స్
ఫ్లూ షాట్

65 ఏండ్లు దాటిన వారికి ప్రమాదమే..

ప్రపంచంలో శిశువులు, వృద్ధుల మరణాలకు పెద్ద ఎత్తున కారణమవుతున్న అతి పెద్ద సంక్రమిత వ్యాధుల్లో న్యుమోనియా ఒకటి. ఊపిరితిత్తుల్లో నీరు చేరి బాధితులకు ఊపిరందని పరిస్థితి తలెత్తుతుంది. 65ఏండ్ల వయస్సు దాటిన వారికి రోగ నిరోధక శక్తి తగ్గడం వల్ల ముప్పు అధికంగా ఉంటుంది. పొగాకు, మద్యం సేవించే వారు చలి కాలంలో మరింత అప్రమత్తంగా ఉండాలి. వ్యాధిని ముందస్తుగా గుర్తిస్తే పూర్తి స్థాయి చికిత్స అందుబాటులో ఉంది. - డాక్టర్ రఘుకాంత్, పల్మనాజిస్టు, మెడికవర్ ఆస్పత్రి.

తల్లిపాలతో న్యుమోనియాను అడ్డుకోవచ్చు

సాధారణంగా తల్లిపాలతో బిడ్డలో రోగ నిరోధక శక్తి స్వతహాగా పెరుగుతుంది. తల్లిపాలు తాగిన పిల్లల్లో న్యుమోనియాను ఆరుసార్లు అడ్డుకునే శక్తి శిశువులో ఉంటుంది.

ప్రభుత్వం టీకాలను పిల్లలకు పూర్తి ఉచితంగానే ఇస్తుంది. వ్యాక్సినేషన్ 80శాతం దాటితే న్యుమోనియా బారినుంచి పిల్లలను కాపాడుకోవచ్చు. చల్లగాలి, పొగ, పెద్దవారిలో ఉన్న ఇన్ఫెక్షన్స్ ద్వారా పిల్లలకు న్యుమోనియా సోకుతుంది. 5 ఏండ్లలోపు వయస్సుగల పిల్లల్లో మరణాలు ఎక్కువగా సంభవిస్తుంటాయి. గతంలో ప్రధానిని కలిసినప్పుడు న్యుమోకోకల్‌ను ప్రభుత్వ టీకా షెడ్యూల్‌లో చేర్చాలని కోరాను. చలి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి. ప్రారంభదశలోనే హాస్పిటల్‌కు తీసుకువస్తే 99శాతం నయం చేయవచ్చు. ఆలస్యమైతే ప్రమాదం.

# దైవారాధనలో రాగి పాత్ర

ఈ రోజుల్లో కూడా పూజాది కార్యక్రమాలకి వెండి, బంగారు పాత్రలు ఉపయోగించే వారు లేకపోలేదు. అయితే ఒకప్పటికంటే ఇప్పుడు అలాంటివారి సంఖ్య తగ్గిందనే చెప్పాలి. ఇక మధ్యతరగతి వారు కూడా ఇత్తడి - రాగి పాత్రలను వాడటం చాలావరకు తగ్గించారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఎవరి ఇంట్లో చూసినా స్టీలు పాత్రలే దర్శనమిస్తున్నాయి. పూజకి ఉపయోగించే అన్ని రకాల పాత్రలు నేడు స్టీలులోనే కనిపిస్తున్నాయి. నగిషీ కారణంగా స్టీలు ... ఇనుము అనే భావన కలగనీయదు. ఈ కారణంగానే దీని వాడకం అంతకంతకూ పెరుగుతూపోతోంది.అయితే ఇటు ఆరోగ్యపరంగాను ... అటు ఆధ్యాత్మిక పరంగాను స్టీలు పాత్రలను వాడకూడదని శాస్త్రం చెబుతోంది.

**పూజలకు స్టీల్ పనికిరాదు:**

స్తోమత వుంటే వెండి - బంగారం, లేదంటే ఇత్తడి - రాగి పాత్రలను వాడటమే అన్ని విధాలా మంచిదని చెబుతోంది. స్టీలు ( ఇనుము) శని సంబంధమైన లోహం కనుక, దానికి బదులుగా ఇతరలోహాలతో చేసిన పాత్రలను మాత్రమే పూజకు వాడాలనీ, అప్పుడే ఎలాంటి దోషాలు లేని పరిపూర్ణమైన ఫలితాలను పొందవచ్చని స్పష్టం చేస్తోంది.

**రాగితో ఆరోగ్యం బోలెడు:**

గతంలో రాగి చెంబు, రాగి బిందె, రాగి గ్లాసు, రాగి ప్లేటు ఇలా ఎక్కువగా రాగి వస్తువులనే వాడే వారు. కాని నేడు ఫ్యాషన్ ఎక్కువయ్యి ప్లాస్టిక్ వచ్చిపడింది. దాంతో రాగి పాత్రల వాడకం బాగా తగ్గిపోయింది. నీళ్ళు తాగాలంటే ప్లాస్టిక్ బాటిల్స్, లంచ్ బాక్సులు కూడా ప్లాస్టికే. నేటి ఇళ్ళు మొత్తం ప్లాస్టిక్ సామానుల మయమైపోయాయి. అయితే రాగి పాత్రలు వాడడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి.

రాగిలో యాంటి బ్యాక్టిరియల్ నేచర్ ఉంటుంది. రాగితో చేసిన పాత్రలలో సూక్ష్మ క్రిములు చేరే అవకాశం ఉండదు. కాబట్టి ఇందులో నిల్వచేసే పదార్థాలు చెడిపోయే అవకాశాలు చాలా తక్కువ. మనకి వచ్చే చాలా రోగాలకి నీటి కాలుష్యం ముఖ్యమైన కారణం. రాగి పాత్రలలో నీళ్ళు ఉంచితే అందులో క్రిములు చేరే అవకాశం చాలా అరుదు. అందుకే పాత రోజుల్లో రాగి బిందెలు వాడేవారు.

చెవులు కుట్టినప్పుడు కూడా చిన్న పిల్లలకి కొన్ని చోట్ల మొదటిసారి రాగి తీగలు చుడతారు. ఎందుకంటే పుండు పడకుండా ఉండటానికి. రాగికి వున్న ఆంటి బ్యాక్టిరియల్ లక్షణం పిల్లలకు ఆ ప్రమాదం రాకుండా చేస్తుంది.

గతంలో నీళ్ళు వేడి చేసుకోవడానికి రాగితో చేసిన బాయిలర్లు వాడే వాళ్ళు. ఇందులో వేడి చేసిన నీరు వాడడం వల్ల చర్మ సంబంధిత రోగాలు కూడా తగ్గేవని రుజువు చెయ్యబడ్డాయి.

రాగి చెంబులో రాత్రి నీరు వుంచి పగలు నిద్ర లేవగానే తాగితే చాలా చాలా మంచిది. అలా తాగితే కడు పులో వున్న చెడు అంతా మూత్రం ద్వారా బయటకి వచ్చేస్తుందట. ఈ అలవాటు వల్ల గ్యాస్, కిడ్నీ, లివర్ సమస్యలు కూడా తగ్గిపోతాయి. బ్రిటిష్‌కి చెందిన ఒక యూనివర్సిటీ వాళ్ళు కూడా రాగిపాత్రలలో ఉంచిన నీటిపై పరిశోధన జరిపి పైన పేర్కొన్న విషయాలు నిజమని నిరూపించారు.

**పరగడుపున రాగి పాత్రలో నీళ్లు:**

రాత్రి రాగి చెంబులో మంచి నీళ్ళు వుంచి పరగడుపున తాగితే హాయిగా జీవించవచ్చు. రాత్రి నిద్ర పోయేముందు అర లీటర్ నుండి లీటర్ ఉండే రాగి చెంబు నిండా మంచినీళ్ళు పోసి మంచం పక్కనే పెట్టుకోవాలి ఉదయం నిద్ర లేచి లేవగానే రెండు సార్లు పుక్కిలించి ఊసి ఆ రాగి చెంబులోని నీళ్లు తాగాలి . దీనివల్ల 15 నిమిషాల నుండి అర గంటలోపు సుఖ విరోచనం అవుతుంది. గ్యాస్, కడుపుబ్బరము, కడుపులో మంట, మలబద్ధకం, తేపులు, మొదలైన బాధలన్నీ ఈ అలవాటుతో ఎటువంటి ఔషదాలు వాడే పని లేకుండా పూర్తిగా తగ్గిపోతాయి.

# ఆధ్యాత్మిక సీమ మన రాయలసీమ

- స్వాత్మానందేంద్ర స్వామి
- కుప్పంలో ముగిసిన స్వధర్మ వాహిని ప్రచార యాత్ర
- కోలార్‌కు పయనమైన యాత్ర

కుప్పం/ చిత్తూరు (విజయభాను న్యూస్): తెలుగు రాష్ట్రాల్లో ఎన్నో పుణ్య క్షేత్రాలున్నా రాయలసీమలో పొందే ఆధ్యాత్మిక అనుభూతి మరెక్కడా రాదని విశాఖ శ్రీ శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర స్వామి పేర్కొన్నారు. రాయలసీమ ప్రాంతంలో కనిపించే ప్రాచీన కట్టడాలు అద్భుతమైన నిర్మాణాలు అని అన్నారు. ఈ కారణంగానే రాయలసీమను ఆధ్యాత్మిక సీమగా పరిగణించవచ్చని తెలిపారు. స్వరూపానందేంద్ర స్వామి సూచనల మేరకు స్వాత్మానందేంద్ర స్వామి చేపట్టిన స్వధర్మ వాహిని ప్రచార యాత్ర బుధవారం కుప్పం పట్టణంలో సాగింది. కుప్పం మున్సిపల్ ఛైర్మన్ సుధీర్ దంపతులు స్వాత్మానందేంద్ర స్వామికి గురువందనం సమర్పించారు. జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు, సాయిమాత సేవా ట్రస్టు నిర్వాహకులు జగదీష్, పలువురు కౌన్సిలర్లు కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం స్వధర్మ వాహిని ప్రచార యాత్రలో భాగంగా స్వాత్మానందేంద్ర స్వామి కుప్పంలోని సోమేశ్వరాలయాన్ని సందర్శించారు. అక్కడి నుండి శ్రీదేవి పీఠంలోని దేవీ ఆలయం, దక్షిణామూర్తి, సీతారామాంజనేయ స్వామి ఆలయాలకు వెళ్ళి పూజలు నిర్వహించారు. ఆలయాల నిర్వహణలో భక్తుల భాగస్వామ్యం పెంచాలని, తద్వారా ఆధ్యాత్మికపరమైన ఆసక్తి భక్తుల్లో పెరుగుతుందని ఆయా ఆలయాల నిర్వహకులకు సూచించారు. అలాగే స్వధర్మ వాహిని ప్రచార యాత్ర ఉద్దేశ్యాన్ని వివరించారు. ఆ తర్వాత



ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలకు వెళ్ళి విద్యార్థులకు ఆధ్యాత్మిక సందేశమిచ్చారు. యువత పాఠ్యాంశాల ద్వారా గ్రహించిన పరిజ్ఞానానికే పరిమితం గాకుండా సాంస్కృతిక, ఆధ్యాత్మిక గ్రంధాల్లో పొందుపరచిన అంశాలను కూడా పరిశీలించాలని సూచించారు.



ఇటీవల ఢిల్లీలో అన్యమతస్తుడి చేతిలో దారుణంగా హత్యకు గురైన యువతి ఉదంతం చూసి మేల్కొనాలని గుర్తు చేశారు. ప్రతిఒక్కరూ స్వధర్మాన్ని ఆచరించాలని, కృష్ణ భగవానుడు చెప్పినట్లు పరధర్మం విషతుల్యమైనదని గ్రహించాలని పేర్కొన్నారు. కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన సేవా కార్యక్రమం లోను స్వాత్మానందేంద్ర స్వామి పాల్గొని నిరుపేదలకు వస్త్రాలను పంపిణీ చేసారు. కుప్పం పట్టణంలో పర్యటన ముగియడంతో కర్ణాటక రాష్ట్రం కోలార్ ప్రాంతానికి యాత్ర బయలు దేరింది. బుధవారం రాత్రి కోలార్ శంకరమఠంలో స్వాత్మానందేంద్ర స్వామి బస చేస్తారు.

# గీతం వర్శిటీలో "ఫిట్ నెస్ ఫ్యాక్టరీ" ప్రారంభం



సాగర్‌నగర్ (విజయభాను న్యూస్) : విద్యార్థులలో శారీరక వ్యాయామం ప్రాధాన్యతను తెలియజేస్తూ ఫిట్ నెస్ పై అవగాహన, అభిరుచి పెంచేవిధంగా గీతం స్కూల్ ఆఫ్ ఫిజియొథెరపీ విద్యార్థులు " ఫిట్ నెస్ ఫ్యాక్టరీ" పేరిట ప్రత్యేక యూత్ క్లబ్ ను ఏర్పాటు చేశారు. గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ బుధవారం ముఖ్య అతిధిగా హజరై ఈ క్లబ్ కార్యకలాపాలను ప్రారంభించారు. ఫిజియొ థెరపీ కోర్సు అభ్యసిస్తూ నే ఇతర విద్యార్థులకు ఫిట్ నెస్ లో మార్గదర్శకం వహించాలన్న క్లబ్ నిర్వాహకుల ఆలోచనను ఆయన అభినందించారు. మానసిక ఆరోగ్యంతో పాటు శారీరక ఆరోగ్యం యువతకు అవసరమని అప్పుడే జీవితంలో సవాళ్ళను ఎదుర్కొనే సమర్థత చేకూరుతుందన్నారు. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్సర్) ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్. బి.గీతాంజలి ఫిట్ నెస్ క్లబ్ ఏర్పాటు ఆలోచనను అభినందించారు. గీతం స్కూల్ ఆఫ్ ఫిజియొ థెరపీ డైరక్టర్ డాక్టర్ మాధురి కాశీ మాట్లాడుతూ విద్యార్థులు అసక్తితో ఫిట్ నెస్ పైదృష్టి సారించేలా జుంబా డాన్స్, హిప్ హప్ నృత్యాలు, యెగా, బాలివుడ్ గీతాలకు ఫిట్ నెస్ నృత్యాలను క్లబ్ ద్వారా ప్రోత్సహిస్తామన్నారు. అలాగే ఫిట్ నెస్ కు సంబంధించిన సందేహాలు, మెలకువలు, సమస్యలకు క్లబ్ ద్వారా పరిష్కారం చూపుతామన్నారు. ప్రారంభ కార్యక్రమంలో పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.





తాడేపల్లి సిఎం క్యాంపు కార్యాలయంలో జరిగిన విశాఖ ఉత్తర నియోజకవర్గం సమీక్ష సమావేశంలో పాల్గొన్న అనంతరం సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్న వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు.

# జాతీయ స్థాయిలో జిల్లా కీర్తి ప్రతిష్టితను ఇనుమడించాలి

మాజీ ఉప ముఖ్యమంత్రి, శాసన సభ్యులు ధర్మాన కృష్ణదాస్




శ్రీకాకుళం : జాతీయ స్థాయిలో జిల్లా కీర్తి ప్రతిష్టితను ఇనుమడింప జేయాలని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి, నరసన్నపేట శాసన సభ్యులు ధర్మాన కృష్ణదాస్ యువతకు పిలుపునిచ్చారు. గురజాడ ఎడ్యుకేషనల్ సొసైటీలో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువజనోత్సవాల్లో విద్యార్థులు తమ ప్రతిభ పాటవాలను కనపరచుకోవచ్చని చెప్పారు. క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పివి సింధు మంచి పేరు తెచ్చుకున్నట్లు వివరించారు. విద్యార్థులు జాతీయ స్థాయిలో జిల్లా కీర్తి ప్రతిష్టతను ఇనుమడింప జేయాలన్నారు. విద్యార్థులు క్రమ శిక్షణతో మందుకు సాగాలని హితవుపలికారు. పట్టుదలతో ఏ కార్యక్రమైనా సాదించవచ్చునని ఉద్బోదించారు. యువజనోత్సవాలలో సాంస్కృతిక పోటీలు 15 సంవత్సరాల నుండి 29 సంవత్సరాల వయసు గల యువతీ యువకులకు 32 అంశాలపై వివిధ రంగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని జిల్లా యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. నవీన్ మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాకు కళలకు, క్రీడలకు ఎంతో ప్రాచుర్యం ఉందన్నారు. విద్యార్థులు అందరూ యువజనోత్సవాల్లో పాల్గొని రాష్ట్ర, జాతీయ స్థాయి ఎంపికలో పాల్గొనడాకి చక్కని అవకాశమని తెలిపారు. క్రీడలు మానసిక ఉల్లాసం కలిగిస్తుందని చెప్పారు. చదువుతో పాటు కళారంగాల్లో పాల్గొని ఉత్తేజితులవ్వాలన్నారు. శ్రీకాకుళం ఎంపిపి అంబటి నిర్మల మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు కళా రంగాల్లో ముందుండాలన్నారు. సెట్ శ్రీ సిఇఓ ప్రసాదరావు మాట్లాడుతూ ప్రతిభ గల వివిధ రంగాల్లో కళాకారులను ఎంపిక చేసి జాతీయ స్థాయి పోటీలకు పంపుతామన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకుముందు స్వామి వివేకానంద చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



# పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలకు అదనంగా 17 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

- జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లిఖార్జున



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : పట్టభద్రుల శాసనమండలి ఓటరు నమోదుకు సంబంధించి వ్యక్తిగత క్లెయిములు, ముసాయిదా జాబితాపై అభ్యంతరాలను ఈ నెల 23వ తేది నుంచి డిసెంబరు 9వ తేదీ వరకు స్వీకరించవచ్చునని జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లిఖార్జున పేర్కొన్నారు. బుధవారం ఉదయం కలెక్టర్ తమ చాంబర్ లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో 77 పోలింగ్ స్టేషన్లు ఉండగా ప్రస్తుతం 17 పోలింగ్ స్టేషన్లను అదనంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కొత్తగా వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు బి.యల్.ఓ ల ద్వారా పరిశీలించి, ఆన్లైలో నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఒకేసారి పెద్ద సంఖ్యలో దరఖస్తులను స్వీకరించరాదన్నారు. వాలంటీర్లు ఓటర్ల నమోదు ప్రక్రియలో పాల్గొనరాదని, వారు పాల్గొన్నట్లు ఫిర్యాదులు అందితే విచారణ జరిపి వెంటనే చర్యలు తీసుకోవాలని డీఆర్వో కు ఆదేశించారు .అనంతరం పార్టీల ప్రతినిధుల సందేహాలను నివృత్తి చేశారు.

ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస మూర్తి , వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు సుమబాల తదితరులు పాల్గొన్నారు.

# మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టరీత్యా నేరం

- మల్కాపురం ట్రాఫిక్ ఎస్సై సుదర్శనరావు



ములగాడ (విజయభాను న్యూస్) : వాహన చోదకులు మద్యం సేవించి వాహనాన్ని నడిపితే చట్టరీత్యా నేరమని, వారికి జరిమానాతో పాటు జైలు శిక్ష తప్పదని మల్కాపురం ట్రాఫిక్ ఎస్సై సుదర్శనరావు హెచ్చరించారు. మల్కాపురం పోలీస్టేషన్ పరిధి యారాడ వెళ్లే సేవా రహదారి వద్ద మల్కాపురం ట్రాఫిక్ ఎస్సై సుదర్శనరావు సిబ్బందితో కలిసి వాహన చోదకులకు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సుదర్శనరావు మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు వాహన చోదకులు తప్పక పాటించాలని లేనియెడల చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని, జరీమానాతో పాటు, జైలు శిక్ష పడుతుందని,ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. వాహన చోదకులు వాహనాలను అతి వేగంగా నడపరాదని, అధిక బరువు తో నడపరాదని , నాలుగు చక్రాల వాహనాలను నడిపేటప్పుడు షీట్ బెల్ట్ తప్పనిసరి అని , డ్రయివింగ్ లైసెన్స్ , వాహన రిజిస్ట్రేషన్ ధ్రువపత్రం , ఇన్సూరెన్స్ ధ్రువ పత్రం తో పాటు అవసరమైన అన్ని ధ్రువపత్రాలు తప్పనిసరిగా ఉండాలని వాహన దారులకు సూచించారు. ఈ డ్రైవ్ లో ఎస్సై తో పాటు ట్రాఫిక్ సిబ్బంది మంగపతి , నాయుడు , అలీ పాల్గొన్నారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com